R.N.I. No. APTEL/2013/48712

ప్రజా చైతన్యమే...

# లక్ష్యం

తెలుగు దినపత్రిక

email : lakshyam2013@gmail.com

ఎడిటర్ ఇన్ చీఫ్ - మధుసూదనరావు చల్లా

Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.

ఎడిటర్ ఇన్ చీఫ్ - మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010

సంపుటి : 12 సంచిక : 117 గుంటూరు మంగళవారం 3 జూన్ 2025 పేజీలు : 8 వెల : 5.00

LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only

## ప్రచారం కాదు, శత్రువుపై దృష్టిపెట్టండి.. మోదీకి ఖర్గే సలహా

బెంగళూరు: ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభల్లో చేస్తున్న ప్రసంగాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారాలకు ప్రధాని దూరంగా ఉంటూ శత్రువుపై దృష్టిసారించాలని సూచించారు. బెంగళూరులో మీడియాతో ఖర్గే మాట్లాడుతూ, ఆయన (మోదీ) ఇచ్చే ప్రతి ప్రకటనకు తాను స్పందించాలని అనుకోవడం లేదని చెప్పారు. అయితే ఇటీవల ఆయన ఇస్తున్న బహిరంగ ప్రకటనలు, రాజకీయాల కార్యకాలాపాలను దృష్టిలో ఉంచుకుని తాను ఒక సూచన చేస్తున్నానని అన్నారు.

ప్రస్తుతానికి కొంతకాలం ఆయన ఎన్నికల ప్రచారాలకు దూరంగా ఉంటూ దేశంపై దృష్టి సారించాలని అన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చామంటూ గతంలో చెప్పిన ప్రధాని మోదీ ఇప్పుడు అంతా తానే చేశానని చెప్పుకోవడం ఏమిటిని ప్రశ్నించారు. సొంత గొప్పలు చెప్పుకోవడం మంచిది కాదన్నారు.

## సుఖోయ్ చక్రాలపై జగన్నాథుడు

### కోల్‌కతాలోని ఆలయ రథానికి యుద్ధ విమానం టైర్లు

కోల్‌కతా : కోల్‌కతాలోని జగన్నాథ ఆలయ రథానికి సుఖోయ్ యుద్ధ విమానం కోసం తయారు చేసిన టైర్లను వాడనున్నారు. ఈ నెల 27న కోల్‌కతాలో జరిగే జగన్నాథ రథయాత్ర కోసం రథాన్ని సరికొత్తగా సిద్ధం చేశారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత జగన్నాథ రథానికి బోయింగ్ విమానం టైర్ల స్థానంలో సుఖోయ్ కోసం తయారు చేసిన టైర్లు వచ్చాయి. ఇంతకు ముందు బోయింగ్ 747 విమానం టైర్లను రథానికి వాడేవారు. టైర్లను మార్చాలని 2005లో రథయాత్ర నిర్వాహక సంస్థ ఇస్కాన్ నిర్ణయించింది. కొత్త చక్రాల కోసం 20 ఏళ్లు అన్వేషించామని ఇస్కాన్ (కోల్‌కతా) ఉపాధ్యక్షుడు రాధారామ్ దాస్ వెల్లడించారు.



## పోలవరం-బనకచర్లపై కేంద్రం ముందుకు ఏపీ ప్రతిపాదనలు

అమరావతి: ‘పోలవరం-బనకచర్ల’ ప్రాజెక్టుపై కేంద్రం ముందుకు ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలు తీసుకెళ్లనుంది. పోలవరం నుంచి బనకచర్లకు నీటి తరలింపు ప్రాజెక్టుపై కేంద్ర ఆర్థిక శాఖకు రాష్ట్ర అధికారులు పూర్తి వివరాలు అందించనున్నారు.

రూ.81 వేల కోట్లతో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. ఈ ప్రాజెక్టుతో రైతులు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ఆర్థిక, నీటిపారుదల శాఖ అధికారులు వివరించనున్నారు. గత నెలలో జరిగిన భేటీల్లో ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను ప్రధాని, ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. సీఎం ప్రతిపాదనలపై పూర్తి వివరాలు ఇవ్వాలని గతంలో కేంద్ర ఆర్థిక శాఖ కోరింది.కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి అజయ్ సేత్‌కు ఏపీ ఆర్థిక శాఖ కార్యదర్శి పీయూష్ కుమార్, నీటిపారుదల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

ప్రాజెక్టు సమగ్ర వివరాలను కేంద్ర ఆర్థిక శాఖకు అందించనున్నారు. ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలు, నీటి పంపిణీ విధానం, భూసేకరణ, ప్రజలకు వచ్చే లాభనష్టాలను వివరించనున్నారు. భవిష్యత్తులో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు స్వీయ ఆర్థిక ప్రాజెక్టుగా ఉంటుందని వెల్లడించనున్నారు. తెలంగాణ లేవనెత్తనున్న అభ్యంతరాలపై కూడా ప్రజెంటేషన్‌లో సమాధానం ఇచ్చే అవకాశం ఉంది.



## పరేడ్ గ్రౌండ్ లో జాతీయ జెండా ఆవిష్కరించిన సీఎం

హైదరాబాద్ : సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జపాన్ ప్రతినిధుల బృందం హాజరైంది. ఈ సందర్భంగా పోలీసులకు ఉత్తమ సేవా పతకాలను సీఎం ప్రదానం చేయనున్నారు. అంతకుముందు తెలంగాణన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ ట్వీట్ చేశారు.

‘ఆహార్యంలో ఆత్మగౌరవం.. ఆ రూపంలో నిండుదనం.. తెలంగాణ తల్లికి.. సదా సర్వదా నీరాజనం’ అని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి గీతాన్ని ఆయన పంచుకున్నారు.

## కొల్లేరు వాసుల సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించాలి: చంద్రబాబు



అమరావతి: పర్యావరణం పరంగా కీలకమైన కొల్లేరు సరస్సును తప్పక రక్షించుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు. కొల్లేరు వాసుల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాల్సి ఉందన్నారు. కొల్లేరుపై కేంద్ర సంస్థల ఆదేశాలు, పర్యావరణం, కాంటూరు అంశాలపై సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. కాంటూరు పరిధి వల్ల 3 లక్షల మంది ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కొల్లేరు కాలుష్యం కాకుండా డ్రైన్ వాటర్‌కు ట్రీట్‌మెంట్ జరగాలన్నారు. “కొల్లేరు నీటిని సముద్రంలోకి తీసుకెళ్లే ఉప్పుటేరులో ఆక్రమణలు తొలగించాలి. కొల్లేరు పరిధిలో 20 వేల ఎకరాల జిరాయితీ, డీ పట్టా భూములు ఉన్నాయి. కాంటూరు సమస్య ఉన్నందున ముందుగా వీరికి న్యాయం జరిగేలా చూడాలి. రాష్ట్ర ప్రతిపాదనలను సీఈసీ, సుప్రీంకోర్టు ముందుంచి వారిని ఒప్పించాలి. పర్యావరణంతోపాటు ప్రజలకూ న్యాయం జరిగేలా కార్యాచరణ ప్రారంభించాలి. 2033 నాటికి రాష్ట్రంలో పచ్చదనం 37శాతానికి, 2047 నాటికి 50శాతం పెరగాలి” అని చంద్రబాబు అన్నారు.

**ఈ నెల 5న కోటి మొక్కలు నాటాలి...** ఈ నెల 5న కోటి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, కలెక్టర్లు పాల్గొనాలని ఆదేశించారు. బస్టాండు, రోడ్ల పక్కన, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ట్రీ గార్డులతో మొక్కలు నాటాలని సూచించారు.

## దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలిచేలా భవిష్యత్ ప్రణాళికలు: రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర సాధన పోరాటంలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకున్నారు. “తెలంగాణను ప్రజలు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్నారు. 11 ఏళ్లు పూర్తయి 12వ ఏడాదిలోకి అడుగుపెట్టాం. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రైజింగ్ నినాదం ఇచ్చాం. ఆర్థిక వృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది. రాష్ట్రం అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా భవిష్యత్ ప్రణాళికలు తీర్చిదిద్దుతున్నాం” అని సీఎం తెలిపారు.

**హైదరాబాద్-కితాక్యూషు మధ్య విమాన కనెక్టివిటీకి ప్రయత్నిస్తున్నాం:** కితాక్యూషు నగరం ఎకో-టౌన్ మోడల్‌తో చాలా ప్రేరణ పొందినట్లు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. జపాన్‌లోని కితాక్యూషు సిటీ మేయర్ కజుహిసా, జపాన్ బృందంతో ఐటీసీ కాకతీయలో సీఎం సమావేశమయ్యారు. తెలంగాణ, కితాక్యూషు పరస్పర సహకార ఒప్పందంపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. “ప్రపంచ భాగస్వామ్యంతో రాష్ట్ర పురోగతిని ముందుకు తీసుకెళున్నాం. కితాక్యూషు నగర అభివృద్ధి తెలంగాణ రైజింగ్‌కు సరిపోయేలా ఉంది. తెలంగాణ-కితాక్యూషు సహకార ఒప్పందం జరగడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం మూసీ నది అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టుపై మా దృష్టి ఉంది. రాష్ట్ర యువతకు నైపుణ్య కల్పించడం మా ప్రాధాన్యత. హైదరాబాద్-కితాక్యూషు మధ్య విమాన కనెక్టివిటీకి ప్రయత్నిస్తున్నాం ” అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## ఇప్పటి వరకు 34.81 లక్షల మందికి రేషన్ సరకులు అందించాం: మంత్రి నాదెండ్ల మనోహర్

విజయవాడ: ఇప్పటి వరకు 34.81 లక్షల మందికి రేషన్ సరకులు అందించామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 3.73 లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ సరకులు అందించామన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వృద్ధులు, దివ్యాంగులకు ఈ నెల 5లోగా రేషన్ ఇవ్వాలని డీలర్లను ఆదేశించినట్లు చెప్పారు. కొన్ని చౌకధరల దుకాణాల వద్ద సర్వర్ సమస్యలు తలెత్తాయని, వెంటనే పరిష్కరించి పంపిణీ కొనసాగించినట్లు చెప్పారు. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయని, పనులు మానుకొని రేషన్ దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు. కార్డుదారులకు మరింత సౌకర్యం కల్పిస్తూ.. ఏ దుకాణానికైనా వెళ్లి



రేషన్ తీసుకునేలా పోర్టబులిటీ తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రతి డీలర్‌కు 10 శాతం ఎక్కువగా సరకులు సరఫరా చేసినట్లు చెప్పారు.



## గత పదేళ్లలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు..

హైదరాబాద్: ఎంతో మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ వచ్చిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన తెలంగాణ అవతరణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ‘తెలంగాణ ఉద్యమం అహింసా పద్ధతిలో సాగింది. ఉద్యమంలో భాజపా కీలక పాత్ర పోషించింది. తెలంగాణకు అనుకూలమని అందరికంటే ముందు నిర్ణయం తీసుకున్న పార్టీ మాది. తెలంగాణ వచ్చాక నీళ్ల పేరుతో నిధుల దోపిడీ జరిగింది. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత భావించింది. కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు వచ్చాయి కానీ.. యువతకు రాలేదు. ఏ ఆకాంక్షల కోసం ప్రజలు పోరాడారో గత పదేళ్లలో అవి నెరవేరలేదు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ ఇవాళ రూ.10 లక్షల కోట్ల అప్పుల్లోకి వెళ్లింది” అని కిషన్‌రెడ్డి అన్నారు.



# ఉద్యోగులకు గుడ్‌న్యూస్

## ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. సాధారణ బదిలీల గడువు పొడిగింపు..

ప్రభుత్వ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఉద్యోగుల సాధారణ బదిలీల గడువు తేదీని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును ఈ నెల 9 వరకు పొడిగించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పీయూష్ కుమార్ జీవో ఎంఎస్ నెంబర్ 30 జారీ చేశారు. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం పలు నిబంధనలు కూడా విధించింది. ఒకే చోట 5 ఏళ్లు గడిచిన రాష్ట్ర ఉద్యోగులను ఖచ్చితంగా బదిలీ చేయాలని ఆదేశించింది. ఒకే చోట ఐదేళ్ల లోపు ఉన్న ఉద్యోగులకు వ్యక్తిగత విన్నపం మేరకు బదిలీకి అవకాశం కల్పించింది. వచ్చే ఏడాది మే 31లోపు రిటైర్మెంట్ అయ్యే ఉద్యోగులకు బదిలీ నుండి మినహాయింపునిచ్చింది. ప్రభుత్వం అంధ ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యత కల్పించింది.

మానసిక రుగ్మత ఉన్న పిల్లల తల్లిదండ్రులకు వినతి మేరకు బదిలీల్లో ప్రాధాన్యత కల్పిస్తోంది. ట్రైబల్ ఏరియాలో రెండేళ్ల కంటే ఎక్కువ కాలం పని చేసిన ఉద్యోగులకు ప్రాధాన్యత కల్పించింది. మెడికల్ గ్రౌండ్లో భాగంగా వినతి మేరకు బదిలీల్లో ప్రాధాన్యత ఉంటుంది. వితంతు ఉద్యోగులకు వారి వినతి మేరకు బదిలీల్లో ప్రాధాన్యత ఉంటుంది. స్పౌజ్ ఉద్యోగులకు ఒకే చోట లేదా దగ్గరి ప్రాంతాల్లో బదిలీ చేసేలా ప్రాధాన్యత కల్పించబడింది. పదోన్నతి పొంది ఒకే ప్రాంతంలో ఐదేళ్లు పూర్తి చేసిన ఉద్యోగులను బదిలీ చేయనుంది.



## జూన్ 11న కాళేశ్వరం కమిషన్ ముందుకు కేసీఆర్

హైదరాబాద్ : కాళేశ్వరం కమిషన్ ముందుకు విచారణకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు మాజీ సీఎం కేసీఆర్. జూన్ 5న హాజరు కావాలని కమిషన్ నోటీసులు పంపిన విషయం తెలసిందే. అయితే విచారణకు హాజరు కావడానికి సమయం కావాలని కమిషన్ ను కోరారు కేసీఆర్. జూన్ 11న హాజరవుతానని, అంత వరకు సమయం ఇవ్వాలని కోరారు. మరోవైపు కాళేశ్వరం కమిషన్ ముందుకు మాజీ మంత్రి హరీష్ రావు జూన్ 9న హాజరుకానున్నారు. ఆయన ఇరేగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపణలు రావడంతో నోటీసులు జారీ చేసింది కమిషన్. అయితే ఈ నోటీసులపై వివరణ ఇవ్వనున్నారు మాజీ మంత్రి హరీష్ రావు. హరీష్ రావు 9న హాజరైన తర్వాత 11న హాజరుకావాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. హరీష్ ను ఎలాంటి ప్రశ్నలు అడగనున్నారో తెలుసుకుని అధ్యయనం చేసి వెళ్లాలని భావిస్తున్నారు. ఇప్పటికే కమిషన్ ముందు హాజరు కావలని నిర్ణయించుకున్న కేసీర్.. ప్రాజెక్టు ప్రారంభం నుంచి పూర్తైనంత వరకు అన్ని వివరాలపై అధ్యయనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఎర్రవల్లి ఫామ్ హౌజ్ లో కేసీఆర్ ను కేటీఆర్, హరీష్ రావు ఇటీవలే వరుసగా కలిసి చర్చించారు. అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావుతో సుదీర్ఘ మంతనాలు జరిపారు కేసీఆర్. ప్రాజెక్టు వివరాలు, కమిషన్ అడిగే ప్రశ్నలు మొదలైన కీలక అంశాలపై ఈ మధ్యే చర్చించారు. హరీష్ రావు కమిషన్ ముందు హాజరయ్యాక మరోసారి కేసీఆర్ ఆయనను కలవనున్నారు. కమిషన్ అడిగిన ప్రశ్నలు, విచారణ జరుగుతున్న విధానాన్ని ఇద్దరు చర్చించనున్నారు. ఆ తర్వాత 11వ తేదీని కమిషన్ ముందుకు వెళ్లాని భావిస్తున్నారు మాజీ సీఎం కేసీఆర్.




తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ పదవిని తెదేపా సొంతం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా కొలికపోగు నిర్మల ఎన్నికయ్యారు. స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఎక్స్ అఫీషియో ఓటుతో పాటు 11 మంది తెదేపా కౌన్సిలర్లు ఆమెకు మద్దతు ప్రకటించారు. వైకాపా అభ్యర్థికి 9 మంది కౌన్సిలర్లు మద్దతు పలికారు. గతంలో కోరం లేకపోవడం తదితర కారణాలతో పలుమార్లు ఎన్నిక వాయిదా పడింది. సోమవారం కోరం సరిపోవడంతో ఛైర్‌పర్సన్ ఎన్నికను అధికారులు నిర్వహించారు. తిరువూరు నగర పంచాయతీలో 20 మంది వార్డు కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో వైకాపాకు చెందిన ఎ.రమాదేవి విదేశాల్లో ఉన్నారు. మిగిలిన 19 మంది వార్డు కౌన్సిలర్లు, ఎక్స్ అఫీసియో సభ్యుడి హోదాలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఈ ఎన్నికలో పాల్గొన్నారు.

# ఏపీలో ఏంటీ ఉపద్రవం




ఏపీలో విచిత్ర వాతావరణం కొనసాగుతోంది. ఒకవైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు వర్షాలు కూడా కురుస్తున్నాయి. రుతుపవనాల కదలిక నెమ్మదించింది. దీంతో క్రమేపి వేడి పెరుగుతోంది. రాయలసీమ, దక్షిణ కోస్తాలో ఉక్కపోత అధికంగా ఉంది. జూన్ 12 నుంచి ఉత్తర కోస్తా వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే వాతావరణం లో ఈ విచిత్ర పరిస్థితులను చూస్తున్న ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అయితే గతం కంటే ఈ ఏడాది వర్షపాతం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ సూచించడం ఉపశమనం కలిగించే విషయం. తాజాగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఖరీఫ్ పనులు ప్రారంభించారు. వరి ఆకుమడులను సిద్ధం చేసే పనిలో పడ్డారు. అయితే ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు దేశంతో పాటు రాష్ట్రాన్ని తాకడం హర్షించదగ్గ పరిణామం.

**వేడి ప్రారంభం..** రుతుపవనాలు ఏపీలో ప్రవేశించడంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడ్డాయి. అయితే ఇప్పుడు రుతుపవనాలు నెమ్మదించడంతో వేడి ప్రారంభం అయ్యింది. కొన్ని జిల్లాల్లో ఎండలు అదరగొడుతున్నాయి. మరికొన్ని జిల్లాల్లో మాత్రం తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. ఈరోజు అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

**ముందుగానే రుతుపవనాలు..** ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు దేశానికి తాకాయి. బంగాళాఖాతం తో పాటుగా అరేబియా సముద్రంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నైరుతి రుతుపవనాలు వేగంగా ఒడిస్సా వరకు కదిలాయి. కానీ గత రెండు రోజులుగా నైరుతి రుతుపవనాల కదిలిక నెమ్మదించింది. పొడిగాలుల వల్ల వేగం తగ్గినట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రభావంతో తూర్పు తీర ప్రాంతాల్లో, వర్షం తక్కువగా ఉండే ప్రాంతాల్లో వేడి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అందులో భాగంగానే రాయలసీమతో పాటు దక్షిణ కోస్తాలో ఉక్క పోత ప్రారంభం అయ్యింది. ఇదే పరిస్థితి వారం నుంచి పది రోజులు పాటు ఉంటుందని భావిస్తున్నారు వాతావరణ శాఖ అధికారులు. జూన్ 12 వరకు పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉంది. రుతుపవనాలు నెమ్మదించడం వల్లే ఈ పరిస్థితి అని అంచనా వేస్తున్నారు.

**11న అల్పపీడనం..** సాధారణంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడుతుంటాయి. అందులో భాగంగా జూన్ 11 తర్వాత బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రభావంతో జూన్ 12 నుంచి 19 మధ్య ఉత్తర కోస్తాలో వర్షాలు పడే అవకాశం ఉంది. అయితే ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రత అమాంతం పెరిగింది. 36 డిగ్రీలకు దాటింది. రాయలసీమలోని తిరుపతిలో అత్యధికంగా 39.8డీ, కోస్తాలోని నెల్లూరులో 39.1డీ, మచిలీపట్నంలో 38.8డీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు బలహీనపడడంతో వేడి పెరుగుతోందని చెబుతున్నారు. ఆదివారం సాయంత్రం పార్వతీపురం మన్యం, పల్నాడు, శ్రీ సత్య సాయి జిల్లాలో కొద్దిపాటి వర్షం కురిసింది. అయితే ఈసారి వర్షాలు తగ్గుముఖం పట్టి ఉష్ణోగ్రతలు పెరిగే ఛాన్స్ కనిపిస్తోంది. అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచిస్తోంది.




**విజయవాడలోని సత్యనారాయణపురంలో నూతన పోలీస్ స్టేషన్‌ను హోం మంత్రి అనిత ప్రారంభించారు. నేరస్థులకు కులం, మతం అంటూ రంగులు పూసి రాజకీయాలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. వైకాపా ప్రభుత్వంలో సుధాకర్, వరప్రసాద్‌ను అవమానించినప్పుడు జగన్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. తెనాలిలో కానిస్టేబుల్‌పై రౌడీ షీటర్లు దాడి చేయడంపై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.**

# వెన్నుపోటుకు.. గొడ్డలి వేట్టుకు పేటెంట్



అమరావతి, జూన్ 02: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఫ్రస్టేషన్‌లో ఉన్నారని.. అందుకే అవాకులు.. చవాకులు మాట్లాడుతున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. సోమవారం అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. జూన్ 4వ తేది వెన్ను పోటు దినం అనటానికి నీకు సిగ్గు లేదా? అంటూ వైఎస్ జగన్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. వెన్నుపోటుకు.. గొడ్డలి వేట్టుకు పేటెంట్ వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అభివర్ణించారు. నిన్ను కంటికి రెప్పలా పెంచిన మీ బాబాయి వైఎస్ వివేకానందరెడ్డికి వెన్నుపోటు పొడిచావంటూ వైఎస్ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ వెన్నుపోటుకు భయపడి నీ వద్దకు నీ తల్లి, చెల్లి సైతం రావడం లేదన్నారు. 85 శాతం ఇచ్చిన హామీలను తమ కూటమి ప్రభుత్వం ఏడాది లోపు నెరవేర్చిందని గుర్తు చేశారు. మీ ప్రభుత్వ హయాంలో మీరు ఇచ్చిన హామీలు కనీసం 15 శాతం కూడా అమలు చేయలేదని గుర్తు చేశారు. సిగ్గు ఎగ్గు లేకుండా జూన్ 4వ తేదీ వెన్నుపోటు దినం చేస్తానని చేప్పడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమా? అంటూ వైఎస్ జగన్‌కు వర్ల రామయ్య సవాల్ విసిరారు. గడిచిన ఐదేళ్లలో ప్రజలపై మోయలేని భారం వేశావంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. 2025 వార్షిక బడ్జెట్‌లో రూ. 47 వేల కోట్లు కేటాయించామని గుర్తు చేశారు. కానీ ఎస్టీ, ఎస్సీ నిధులు సైతం దారి మళ్లించిన వ్యక్తి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని తెలిపారు. లిక్కర్ స్కామ్‌లోని నిందితులు బ్లేడ్ బాచ్, గంజాయి బ్యాచ్ మధ్య జీవిస్తున్నారని వ్యంగ్యంగా అన్నారు. వైఎస్ జగన్ చెప్పింది చేయడం వల్లే.. ఒక్కప్పుడు మంచి ఆఫీసర్లు సైతం జైలు పాలవుతున్నారని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌కు నైతిక విలువలు లేకుండా పోతున్నాయన్నారు. వైఎస్ జగన్ ముందు ఎటువంటి గ్యాంగ్‌లు పనికి రావని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు స్పష్టం చేశారు.




హైదరాబాద్ : గ్రేటర్‌లో మూడు నెలల రేషన్ పంపిణీ మొదలైంది. ఈసారి వర్షాలు ఎక్కువగా ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకే నెలలో అందించే విధంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈసారి సన్న బియ్యంతో పాటు మూడు నెలలకు సరిపడా గోధుమలు, చక్కెర కూడా పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 30 తేదీ వరకు రేషన్ ఇవ్వనున్నామని, డీలర్లు నెల మొత్తంలో మూడుసార్లు బయోమెట్రిక్ తీసుకుని సన్న బియ్యం ఇస్తారని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరిచి ఉంటాయన్నారు. ఈసారి మూడు నెలలకు సంబంధించిన రేషన్?ను ఒకేసారి ఇస్తున్నందున మూడు సార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి ఉంటుందని, అందుకని, ఒక్కో రోజు గ్యాప్ ఇచ్చి సరుకులు తీసుకోవాలని కోరారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించడానికి రేషన్ దుకాణాల వద్ద తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో బ్యానర్లు ఏర్పాటు చేశామని, సాఫ్ట్‌వేర్ అప్డేట్ లోపం కారణంగా ఆలస్యమైతే సంయమనం పాటించాలని సికింద్రాబాద్ సహాయ పౌరసరఫరాల శాఖాధికారి ఏఆర్ కృష్ణవేణి కోరారు.

**ఆరున్నర లక్షల కార్డులు..** జంటనగరాల్లోని 6,47,282 ఆహార భద్రతా కార్డులు ఉండగా, 24,24,824 మంది లబ్ధిదారులున్నారు. జూన్ నెలకు గాను 45,259.677 వేల మెట్రిక్‌టన్నుల సన్న బియ్యం, 9,709.230 మెట్రిక్ టన్నుల గోధుమలు, 88.695 మెట్రిక్?టన్నుల చెక్కర కేటాయించామని రమేశ్‌చెప్పారు. ఆహార భద్రత కార్డుదారులైతే ఒక్కో వ్యక్తికి 6 కిలోలు అంటే మూడు నెలలకు 18 కిలోల బియ్యం, అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోలు అంటే మూడు నెలలకు 105 కిలోల బియ్యం ఇస్తున్నామన్నారు. అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల చొప్పున 30 కిలోలు అందజేస్తున్నామన్నారు.

**ఈపాస్ రసీదులు ఇస్తున్నాం...** మూడు నెలల రేషన్ బియ్యంతో పాటు ఈసారి ప్రతి కార్డుదారుడికి మూడు నెలలకు గాను గోధుమలు, చక్కెర కూడా ఇస్తున్నాం. 5 కిలోల చొప్పున 15 కిలోల గోధుమలు రూ.7కు కిలో చొప్పున , 3 కిలోల చక్కెర 13.50 రూపాయలకు అందజేస్తున్నాం. కార్డుదారులందరికీ పంపిణీ టైంలో ఈపాస్‌రసీదులు మూడు నెలలకు విడిగా ఇస్తున్నాం. **– రమేశ్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి**

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం.. తెలుగులో ప్రధాని మోడీ స్పెషల్ ట్వీట్



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ప్రజలకు స్పెషల్ విషెస్ చెప్పారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశారు. 'తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. జాతీయ పురోగతికి అవిరళమైన కృషి చేసినందుకు ఈ రాష్ట్రం ప్రసిద్ధి చెందింది. గత దశాబ్దంలో, రాష్ట్ర ప్రజల 'జీవన సౌలభ్యాన్ని' పెంచడానికి NDA సర్కార్ అనేక చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రజలకు విజయాలు, సంపదలు కలిగేలా ఆశీర్వాదాలు లభించాలని కోరుకుంటున్నా' అంటూ ప్రధాని ట్వీట్ చేశారు.

**తెలంగాణ ప్రజలు సంమృద్ధి మార్గంలో సాగాలి.. రాష్ట్రపతి ముర్ము...** తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము '%శ%' వేదిక ట్వీట్ చేశారు. 'తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు..! ఈ యువ రాష్ట్రం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, ఆర్థిక, సాంకేతిక అభివృద్ధి యొక్క శక్తివంతమైన ఆధునిక పరిణామాన్ని కలిగి ఉంది. తెలంగాణ ప్రజలు పురోగతి మరియు సమృద్ధి మార్గంలో ముందుకు సాగాలని నేను కోరుకుంటున్నా' అంటూ ప్రెసిడెంట్ ద్రౌపది తెలంగాణ ప్రజలకు విషెస్ చెప్పారు.

# తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు



ఏపీ సీఎం చంద్రబాబు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రాష్ట్రాలుగా వేరైనా తెలుగు ప్రజలు, తెలుగు జాతి ఒక్కటే. తెలుగువారు ఎక్కడున్నా సమున్నతంగా ఎదగాలన్నదే తన ఆకాంక్ష అని ఆయన ట్వీట్ చేశారు. "తెలుగు రాష్ట్రాలుగా వేరైనా తెలుగు ప్రజలు, తెలుగు జాతి ఒక్కటే. తెలుగువారు ఎక్కడున్నా సమున్నతంగా ఎదగాలన్నదే నా ఆలోచన, ఆకాంక్ష. 11వ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్న తెలంగాణ ప్రజలకు నా శుభాకాంక్షలు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని, అభివృద్ధి పథంలో సాగాలని కోరుకుంటున్నాను. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీపడుతూ వికసిత్ భారత్-2047 నాటికి అగ్రస్థానానికి చేరుకోవాలని, తెలుగు జాతి తిరుగులేని శక్తిగా నిలవాలని.. ఇందులో ప్రతి తెలుగు పౌరుడు భాగస్వామి కావాలని ఆకాంక్షిస్తున్నాను" అని చంద్రబాబు తన 'ఎక్స్' పోస్టులో రాసుకొచ్చారు.





అమరావతి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్ర ప్రజలకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. తనలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల తెలంగాణ అని పేర్కొన్నారు.

'జనసేన పార్టీకి జన్మనిచ్చిన నేల.. నాకు పునర్జన్మను ఇచ్చిన నేల.. నాలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల.. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ దాశరథి కృష్ణమాచార్య కీర్తించిన నేల నా తెలంగాణ. మూడున్నర కోట్ల ప్రజల ఆశలు, ఆకాంక్షలతో పాటు దశాబ్దాల పోరాటాలకు ప్రతిరూపంగా విద్యార్థులు, యువత బలిదానాలతో ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ.

రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని కోరుకుంటున్నాను" అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

# ఏపీలో అద్భుతంగా అభివృద్ధి.. తెలంగాణ వెలవెల: ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్: తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ అణచివేసిందని.. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మూడు తరాల ఉద్యమంలో అసువులు బాసిన విద్యార్థులకు నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ మలిదశ ఉద్యమంలో అన్ని పార్టీలూ ఏకమై సంఘటితంగా పోరాటం చేశాయి. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు భాజపా అన్ని విధాలుగా సహకరించింది. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో నిరంకుశ పాలన చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా అమరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. భారాస పేరు చెప్పి కాంగ్రెస్ తప్పించుకుంది. తెలంగాణ కంటే ఏపీ జీడీపీ, ఆదాయం తక్కువ. ఏపీ అద్భుతంగా అభివృద్ధి చెందుతుంటే తెలంగాణ వెలవెలబోతోంది.

సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీకి వెళ్లి ప్రధానిని పెద్దన్న అంటారు.. గల్లీకి వచ్చి విమర్శిస్తారు. తెలంగాణ ప్రజల ఆశలను భారాస, కాంగ్రెస్ కల్లలు చేశాయి. ఇక్కడ భాజపా అధికారంలోకి రావడం ఖాయం.. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించడం తథ్యం. భారాస నేత హరీశ్‌రావు, నేను ఎందుకు కలుస్తాం? ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైంది? భారాస హయాంలోని ఒక్క అవినీతి, అక్రమాలపైనైనా చర్యలు తీసుకున్నారా?" అని ఈటల ప్రశ్నించారు.

# భారాసకు ఎవరితోనూ పొత్తు ఉండదు.. ఒంటరిగానే అధికారంలోకి: హరీశ్‌రావు



హైదరాబాద్: అభివృద్ధిలో కేసీఆర్.. అబద్ధాల్లో సీఎం రేవంత్‌రెడ్డి అగ్రగామి అని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు రూ.21కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు సీఎం చెప్పారని.. దాన్ని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టు కట్టారా? ఒక్క చెరువు తవ్వారా?రైతుబంధు, రైతుబీమా ఎగ్గొట్టారు.. రుణమాఫీ కొంతే చేశారు" అని విమర్శించారు. "భాజపాలో భారాస కలుస్తుందని కొందరు మాట్లాడుతున్నారు. భారాస ఎవరితోనూ పొత్తు పెట్టుకోదు.. ఒంటరిగానే అధికారంలోకి వస్తుంది. కేసీఆర్ మొన్ననే కుండబద్ధలు కొట్టి చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా భారాసకు 100 సీట్లు ఖాయం. గోదావరి-బనకచర్లపై భాజపా నేతలు ఎందుకు మాట్లాడట్లేదు? అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లి గోదావరి-బనకచర్లను అడ్డుకుంటాం. అతి చేస్తున్న అధికారుల పేర్లు రెడ్‌బుక్‌లో రాసుకుని గుణపాఠం చెప్తాం. అందాల పోటీలు నిర్వహించడం చేతగాక రాష్ట్రం పరువు తీశారు. మిస్ ఇంగ్లండ్ చేసిన ఆరోపణలపై సీసీ ఫుటేజీ బయటపెట్టాలి" అని హరీశ్‌రావు అన్నారు.

# రైతులు వద్ద ఉన్న నల్ల బర్లీ పొగాకు ను ప్రభుత్వాలు వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షులు. వి కృష్ణయ్య డిమాండ్






పెదనందిపాడు జూన్ 2. (లక్ష్యం న్యూస్). రాష్ట్రంలో పలు ప్రాంతాలకు చెందిన రైతుల వద్ద నున్న నల్ల బర్లీ పొగాకును కంపెనీలు, ప్రభుత్వం తక్షణమే బాధ్యత తీసుకుని కొనుగోలు చేయాలని ఎ.పి.రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెదనందిపాడు తాహిశీల్ధార్ కార్యాలయం వద్ద పెదనందిపాడు, కాకుమాను మండలాల నల్ల బర్లీ పొగాకు పండించిన రైతులు . రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ బి వెంకట స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ.గత ఏడాది ధర తగ్గకుండా కంపెనీల ఏజంట్లు రైతులకు నమ్మ బలికి రైతులను ప్రోత్సహించి పొగాకు పంట వేయించారని, పంట ఇంటికి వచ్చిన తర్వాత రైతులను ప్రోత్సహించిన జాడ లేకుండా పోయారని దుయ్యబట్టారు.కొంత మందికి బాండ్లు కూడా ఇచ్చారని , వారు కూడా కుంటి సాకులు చెబుతూ తప్పించుకు తిరుగుతున్నారని అన్నారు. వారి మాటలు నమ్మిన రైతులు , కౌలు రైతులు అప్పులు చేసి మరీ నల్ల బర్లీ పొగాకు పంట వేశారని అన్నారు. ఇప్పటికి పంట ఇంటికి వచ్చి మూడు నెలలైనా ఏ కంపెనీ కొంటామని ముందుకు రాకపోవడం చాలా అన్యాయమని అన్నారు.రైతు సంఘాల ఆందోళన మేరకు కొంత వరకు కొనుగోళ్లు ప్రారంభించినా , ధర పూర్తిగా తగ్గించి గత సంవత్సరం ధరలో సగంకూడా ఇవ్వడం లేదన్నారు. నల్ల బర్లీ, వర్జీనియా,తెల్ల బర్లీ పొగాకు ను రైతులు పండించారని చెప్పారు..దేనికీ సరైన ధర లేక కొనే నాథుడు లేక రైతులు ఆందోళన తో పాటు ఆవేదన చెందుతున్నారన్నారు.ఈ సంవత్సరం రాష్ట్రంలో నల్ల బర్లీ పొగాకు లక్ష ఎకరాల్లో పండించారని అన్నారు.కంపెనీలు దీన్ని కొనుగోలు చేయమని తెగేసి చెబుతున్నారని అన్నారు.తక్షణమే ప్రభుత్వం బాధ్యత తీసుకుని కంపెనీల చేత కొనిపించాలని, వారు కొనకపోతే ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కృష్ణయ్య కోరారు.జూన్ 5 న గుంటూరు లోని జి.పి.ఐ.కంపెనీ వద్ద జరిగే ధర్నాలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని ప్రభుత్వం పై వత్తిడి తేవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ రైతుల్ని కోరారు. రైతు సంఘాల వత్తిడితో కంపెనీలతో సమవేశాలు జరిపిన ప్రభుత్వం , కంపెనీలతో కొనుగోలు చేయిస్తామని చెబుతుంది తప్ప బాధ్యతగా వ్యవహరించడం లేదని అన్నారు.పొగాకు, పొగాకు ఉత్పత్తుల ద్వారా ఏడాదికి 73 వేల కోట్ల రూపాయలు పన్నుల రూపంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం వస్తుందని అన్నారు.ఇలాంటి కష్ట కాలంలో ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు పెట్టి పొగాకును కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పొగాకు నెల రోజుల లోపు కొనకపోతే రైతుల ఆత్మహత్యలు పెరిగే అవకాశం ఉందని అన్నారు.ఇప్పటికే ముగ్గురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు.కూలీలకు ఇచ్చేందుకు వారి వద్ద డబ్బులు లేక , అప్పులు తీర్చే దారి తెలియక దిక్కు తోచని స్తితిలో రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు.ఎకరానికి లక్ష నుండి లక్షన్నర వరకు ఖర్చు చేసి పంట పండించారని అన్నారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వెంటనే ప్రభుత్వం బాధ్యత వహించి పొగాకు కొని రైతుల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ధర్నాలో పాల్గొన్న రైతుల్ని ఉద్దేశించి తెలుగుదేశం నాయకులు కొల్లా సురేంద్ర, జనసేన మండల నాయకులు దిరిశాల శ్రీనివాసరావు, రైతు సంఘం మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, కన్నెగంటి చంద్రరావు, పలువురు రైతులు మాట్లాడారు. ఈ ధర్నాలో మండలం లోని పాలపర్రు, పెదనందిపాడు, నాగులపాడు, కట్రపాడు, వరగాని, పుసులూరు, రాజుపాలెం, అన్నవరం, అన్నపర్తి రైతులు, కాకుమాను మండలానికి చెందిన కొమ్మూరు, పెద్దివారిపాలెం, గార్లపాడు, కాకుమాను, కొండపాటూరు రైతులునల్లమోతు రాజేంద్ర. కాపు వెంకటసుబ్బారావు,ముజావర్ లతీఫ్, జంపని రామారావు, గారే యేసోబు,రామినేని శ్రీనివాసరావు, దొప్పలపూడి సుబ్బయ్య,యోహాన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# తన కుంభకోణాలు, అవినీతి విచారణ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే జగన్ డ్రామాలు : మాజీమంత్రి ప్రత్తిపాటి, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్.





చిలకలూరిపేట జూన్ 2( లక్ష్యం న్యూస్)::కూటమిప్రభుత్వం నిష్పక్షపాతంగా, నిజాయితీతో తన హయాంలో జరిగిన అవినీతి, కుంభకోణాలను వెలికితీస్తోందన్న భయంతో, ప్రజల దృష్టి వాటిపై నుంచి మళ్లించడానికే జగన్ వెన్నుపోటు దినం పేరుతో డ్రామాలు ప్రారంభించాడని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మాజీమంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కూటమినేతలతో కలిసి ప్రత్తిపాటి సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

**జగన్ పిలుపివ్వడమే గానీ ప్రజలు స్పందించడం లేదు..**

జగన్ ఆలోచనలు... ఆయన తన పార్టీ శ్రేణులకు పిలుపునిస్తున్న కార్యక్రమాలు చూస్తే, మాజీ ముఖ్యమంత్రిగా కాకుండా మాజీ ఖైదీగా ఆలోచిస్తున్నట్టుగా ఉందని ప్రత్తిపాటి చెప్పారు. జగన్ ఎప్పుడు ఎలాంటి పిలుపునిచ్చినా ప్రజల్లో స్పందన లేదన్నారు. ఓటమి తర్వాత జగన్ చేపట్టిన ఏ కార్యక్రమానికి ప్రజల మద్ధతు లేదన్న ప్రత్తిపాటి. ఆయన సాగించిన విధ్వంస పాలనతో నష్టపోయిన రాష్ట్రాన్ని, వ్యవస్థలను ఒక మార్గంలో పెట్టడానికే చంద్రబాబుకు సంవత్సరం పట్టిందన్నారు. ఇంకా పూర్తిగా రాష్ట్రం గాడినపడలేదన్న ప్రత్తిపాటి...కూటమిప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలు మాత్రం ప్రశాంతంగా, ఎలాంటి భయాందోళనలు లేకుండా ఉన్నారన్నారు. సొంతతల్లి..చెల్లి సంతోషాన్నే జీర్ణించుకోలేని జగన్, ప్రజల సంతోషాన్ని ఓర్చుకుంటాడా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. ఆ ఈర్ష్యతోనే తన అవినీతి మీడియాలో కూటమిప్రభుత్వంపై, ప్రభుత్వ కార్యక్రమాలపై విషం చిమ్ముతున్నాడని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ దోపిడీకి, అరాచకపాలన చేసిన వైసీపీనేతలతో పాటు వారికి సహకరించిన ఐ.ఏ.ఎస్. ఐ.పీ.ఎస్ అధికారులు కూడా జైలుకువెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు.

**జగన్ ప్రాయశ్చిత్త..పశ్చాత్తాప దినాలు పాటిస్తే ప్రజలు సంతోషిస్తారు**

అధికారం శాశ్వతమన్న అహంకారంతో జగన్, ఆయన బ్యాచ్ తక్కువ కాలంలో ఎక్కువ అక్రమార్జనకు పాల్పడ్డారని, ఆ ఫలితాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. ఈజీమనీకి అలవాటుపడిన వారెవరూ ఎదిగినట్టు చరిత్రలో లేదన్న ప్రత్తిపాటి, జగన్.. వైసీపీ నాయకులు ఎక్కడుండాలో అక్కడే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. జగన్ వెన్నుపోటు దినాలకు బదులు.. తాను చేసిన తప్పులు, పాపాలు, మోసాలకు ప్రాయశ్చిత్తంగా ప్రాయశ్చిత, పశ్చాత్తాప దినాలు పాటిస్తే ప్రజలు సంతోషిస్తారని ప్రత్తిపాటి స్పష్టంచేశారు.

**జగన్ పరామర్శించబోతోంది వైసీపీ కార్యకర్తలనా.. నేరస్తులనా : మాజీ మంత్రి శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్.**

జగన్ తెనాలి పర్యటనకు వచ్చేముందు తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, ఆయన తన పార్టీ కార్యకర్తల పరామర్శకు వస్తున్నాడా..లేక నేరస్తులతో ములాఖత్ అవ్వడానికి వస్తున్నాడో చెప్పాలని మాజీమంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి డిమాండ్ చేశారు. గతంలో ఓదార్పు యాత్రలో కూడా రైతుల పరామర్శ పేరుతో జగన్ రాజకీయాలే చేశాడన్నారు. అధికారంలోఉన్నా.. లేకపోయినా జగన్ ఎప్పుడూ కుల, మత, ప్రాంతీయ విద్వేషాలనే నమ్ముకున్నాడని ఆలపాటి స్పష్టంచేశారు. పోలీసులపై దాడిచేసిన గంజాయి మూకల్ని శిక్షించిన ఖాకీల చర్యల్ని ప్రజలు హర్షించి.. సమర్థిస్తే, జగన్ మాత్రం పోలీసువారిని తప్పుపట్టడం సిగ్గుచేటన్నారు. కల్తీమద్యం .. గంజాయి .. డ్రగ్స్ అమ్మేవారికి మద్ధతిస్తున్న జగన్ వైఖరి చూస్తుంటే, మరలా ఆయన తన పాతనేర స్వభావాన్ని బయటపెట్టే ప్రయత్నం చేస్తున్నాడేమో అన్న సందేహం ప్రజలకు కలుగుతోందన్నారు. జగన్ తన జీవితమంతా చెడును ప్రోత్సహిస్తూ, నేరగాళ్లను సమర్థించడమే పనిగా పెట్టుకున్నాడని ఆలపాటి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధికారదుర్వినియోగానికి పాల్పడి, రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ 50ఏళ్లు వెనక్కువెళ్లిందన్నారు. అంత దుర్మార్గానికి, దుశ్చర్యకు పాల్పడిన జగన్ ఏ ముఖం పెట్టుకొని, ఎవరికి వత్తాసు పలకడానికి తెనాలి వస్తున్నాడో చెప్పాలని ఆలపాటి డిమాండ్ చేశారు.

**జగన్ పరామర్శకు అర్హులైన జాన్ విక్టర్.. రమేశ్.. కరిముల్లాలు పదులకొద్దీ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారు**

పలుకేసుల్లో ముద్దాయిలు తనకు ఆప్తులు ఎలా అయ్యారో వారిని పరామర్శించడంలోని తన ఆంతర్యం ఏమిటో జగన్ ప్రజలకు చెప్పాలని రాజేంద్రప్రసాద్ వైసీపీ అధినేత జగన్ ను నిలదీశారు. జగన్ పరామర్శించబోతున్న జాన్ విక్టర్ పై 2017 నుంచి వివిధనేరాల్లో ముద్దాయిగా ఉండి, పదులకొద్దీ కేసులు నమోదైన మాట వాస్తవం కాదా అని ఆలపాటి ప్రశ్నించారు. అక్రమ మద్యం, దొంగతనం, ఫోర్జరీ, దాడులు, హత్యాయత్నం కేసుల్లో ప్రధాన ముద్దాయిగా ఉన్న వ్యక్తి, తనకు ఆప్తుడు ఎలా అయ్యాడో జగన్మోహన్ రెడ్డే సమాధానం చెప్పాలని ఆలపాటి డిమాండ్ చేశారు. అలానే దోమా రమేశ్ అనే మరో నిందితుడిపై కిడ్నాప్, హత్యాయత్నం, దొంగతనం కేసుల్లో ముద్దాయని, కరిముల్లా అనే వ్యక్తి పోలీస్ స్టేషన్ పై దాడిచేసిన కేసులో ముద్దాయని ఆలపాటి తెలిపారు. గతంలో డాక్టర్ సుధాకర్ ని, డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని గానీ, పల్నాడులో హత్యగావింపబడిన విక్రమ్ కుటుంబాన్ని, జడ్జీ రామకృష్ణను, వైద్యురాలు రాణిని పరామర్శించని జగన్, ఇప్పుడు మాత్రం పరామర్శల పేరుతో నేరస్తుల కు కొమ్ముకాయడం ఆయన నేర, హత్యా రాజకీయాలకు నిదర్శనం కాదా అని ఆలపాటి ప్రశ్నించారు. తన ఇంటికి కూతవేటు దూరంలో దళితయువతిపై అత్యాచారం జరిగితే ముఖ్యమంత్రిగా స్పందించని జగన్..ఇప్పుడు మాత్రం దళితులపై కపటప్రేమ నటిస్తూ పరామర్శలపేరుతో వారిని రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేస్తున్నాడని ఆలపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, జవ్వాజి మధన్ మోహన్, పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమలా రవి, మురకొండ మల్లిబాబు, ముల్లా కరిముల్లా, అజర్, గుర్రం నాగపూర్ణ చంద్రరావు, బేరింగ్ మౌలాలి, పిల్లి కోటి తదితరులున్నారు.

# విజ్ఞాన కేంద్రం బహుముఖ కార్యక్రమాల నిర్వహణ తో ప్రజలకు సేవలందించాలి..

## మాజీ ఎం.ఎల్.సి.లక్ష్మణరావు





పెదనందిపాడు జూన్ 2. (లక్ష్యం న్యూస్) పెదనందిపాడు లోని తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం లో సోమవారం మహిళలకు కుట్టు శిక్షణ 4 వ బ్యాచ్ ను ముఖ్య అతిథిగా పాల్గొన్నకె.ఎస్. లక్ష్మణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకి విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షత వహించగా.లక్ష్మణరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ విజ్ఞాన కేంద్రం నిర్మాణ సమయంలో దీన్ని నిరంతరం నడపడం సాధ్యమేనా అనే సందేహం కలిగిందని అన్నారు.ఒక్కో బ్యాచ్ మూడు నెలల పాటునడపడం అభినందనీయమని, ఈ సందర్భంగా నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.యువకులకు కంప్యూటర్ శిక్షణ ప్రారంభించాలని,నవంబర్, డిసెంబరు నెలలో బాలోత్సవం నిర్వహించాలని కోరారు. ప్రముఖ వ్యాపారవేత్త అరవపల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసలకోర్చి విజ్ఞాన కేంద్రం లో పలు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అందరికీ పని దొరకని నేటి పరిస్తితులలో కుట్టు శిక్షణ నేర్చుకోవడం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని అన్నారు.కుట్టు శిక్షణ లో మెళుకువలు , అధునాతన డిజైన్ లు నేర్చుకొని ఎక్కువగా సంపాదించుకోవచ్చని అన్నారు. మరో వ్యాపార వేత్త ముద్దన రాఘవయ్య మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం నిర్వహణ కు తమ వంతు సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు.మోటార్ వైండింగ్ లాంటి తర్ఫీదు కూడా ఇస్తే యువకులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.లక్ష్మణరావు విజ్ఞాన కేంద్రం అభివృద్ధి కార్యక్రమాలు అన్నింటిలో పాల్గొనడం చాలా సంతోషం గా ఉందని అన్నారు. విజ్ఞాన కేంద్రం నిర్మాణం, నిర్వహణ లో సహాయసహకారాలు అందిస్తున్న నాట్స్ పూర్వ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి , మాజీ శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.కుట్టు శిక్షణ పొందిన మహిళలలకు దాతల సహకారంతో పలువురు పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందించడం జరిగిందని తెలిపారు.శిక్షణ పొందిన మహిళలలకు సర్టిఫికేట్ లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.గత మూడు బ్యాచ్ లలో శిక్షణ పొందిన మహిళలు కొందరు టైలరింగ్ షాపులు పెట్టుకుని స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఈ రోజు జరిగిన కుట్టు శిక్షణ 4 వ బ్యాచ్ ప్రారంభ కార్యక్రమం లో మాజీ ఎంపిపి నర్రా బాలకృష్ణ. ప్రముఖ వ్యాపారవేత్త దాసరి శేషగిరిరావు, నూతి బాపయ్య చౌదరి తల్లిదండ్రులు సుబ్బారావు సీతా మహాలక్ష్మి. మర్రి లక్ష్మి. మణి టీచర్. అంగన్వాడి నాయకురాలు శివ పార్వతి. కుట్టు శిక్షణా టీచర్ కొర్రపాటి లక్ష్మి. సీనియర్ నాయకులు జంపని రామారావు. విశ్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకుడు గారపాటి రమేష్. కాపు వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (NTA AP)

గుంటూరు జూన్ 2 (లక్ష్యం ప్రతినిధి) కృష్ణా - గుంటూరు జిల్లా ల మాజీ ఉపాధ్యాయ శాసన మండలి శ్రీ Dr.A.S. రామ కృష్ణ గారు – నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (NTA AP)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు లు మంగళగిరి లోని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీ కె. విజయ రామరాజు గారిని ఉపాధ్యాయ బదిలీ లలో ఎదురవుతున్న సమస్యలపై ప్రాతినిధ్యం చేయడం జరిగింది. అవి (1) ప్రిఫరెన్షియల్ కేడర్ లోని ఉపాధ్యాయులకు వారి అవసరాల దృష్ట్యా అన్ని ఖాళీలను కోరుకునే విధంగా అవకాశం కల్పించాలని (2) 2023 లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులును ప్రైమరీ స్కూల్



ప్రధానోపాధ్యాయులుగా తప్పనిసరిగా పెట్టుకోవాలానే నిభందన సరికాదని (3) బదిలీ కు వెబ్ ఆప్షన్ పెట్టే ముందు అన్ని కేడర్ ల సీనియారిటీ లిస్టులు మరియు Vacancy లిస్టులు ప్రకటించాలని (4) ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్ పెట్టుకునేందుకు కనీసం 3 రోజుల వ్యవధి ఉండాలని (5) మోడల్ స్కూల్స్ లో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు కూడా బదిలీలు చేపట్టాలని కోరారు. ఈ సమస్యల పట్ల కమీషనర్ గారు సానుకూలంగా స్పందించడం జరిగింది .

# ఏపీ బీసీ అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ కర్పూరి ఠాకూర్ అవార్డు గ్రహీత తాటికొండ నరసింహారావు కి సత్కారం

గుంటూరు జూన్ 2 (లక్ష్యం ప్రతినిధి) లాసెట్ వ్రాయు అభ్యర్థులకు అవగాహన కోసం స్వచ్ఛందంగా ఉచితంగా గత తొమ్మిది సంవత్సరాలుగా లాసెట్ కాంపిటేషన్ ఎగ్జామ్స్ నిర్వహించటం ఎంతో ఆనందంగా ఉందని పబ్లిక్ ప్రాసిక్యులేటర్ పల్లపు కృష్ణ పేర్కొన్నారు. ఈ కాంపిటీషన్ ఎగ్జామ్స్ లో అధిక మార్కులు వచ్చిన అభ్యర్థులకు మొదట ద్వితీయ బహుమతులు తాటికొండ నరసింహారావు జూపూడి శ్రీనివాసరావు చేతుల మీదగా అందజేయడమైనది. అనంతరం ఆంధ్రప్రదేశ్ బీసీ అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉద్యమ నేత పోరాటయోధుడు కర్పూరి ఠాకూర్ అవార్డు గ్రహీత తాటికొండ నరసింహారావు కి చిరు సత్కారం చేయడమైనది.



మాంటిస్సోరి స్కూల్ ప్రిన్సిపల్ సెభాస్టియన్ మాట్లాడుతూ నిస్వార్థులైన పోరాటయోధుడు కర్పూరి ఠాకూర్ అవార్డు గ్రహీత తాటికొండ నరసింహారావు లాంటి వాళ్ళని సన్మానించుకోవటం అంటే మనల్ని మనం గౌరవించుకోవడం అని తెలిపారు నేటి సమాజంలో ఇలాంటి పోరాట స్ఫూర్తి కలిగిన వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని ఇలాంటి వాళ్ళని మనం సత్కరించి గౌరవించుకోవడం మన బాధ్యత అని తాటికొండ లాంటి ఉద్యమకారులు ఈ సమాజానికి ఆదర్శనీయులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏపీపీ పరిసిపోగు సునీల్ కుమార్ గుంటూరు బారు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోతుకూరి శ్రీనివాసరావు స్పోర్ట్స్ అండ్ కల్చర్ కార్యదర్శి గండికోట శేషగిరిరావు సామాజిక ఉద్యమకారులు జూపూడి శ్రీనివాసరావు న్యాయవాదులు జనార్దన్ రావు చిలకా డేవిడ్ రాజ్ జి కోటేశ్వరరావు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# 16వ డివిజన్ పరిధిలోని ఏటుకూరు లో రేషన్ దుకాణాం ప్రారంభించిన ఉప్పు వెంకటరత్తయ్య దాసరి లక్ష్మి దుర్గ జనసేన పార్టి నాయకులు



గుంటూరు జూన్ 2 (లక్ష్యం ప్రతినిధి) గుంటూరు పట్టణం లోని 16 వ డివిజన్ లోని 222 నెంబర్ గల రేషన్ షాపు ను స్థానిక కార్పొరేటర్ శ్రీమతి దాసరి లక్ష్మి దుర్గ , గుంటూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య కలిసి ప్రారంభించినారు. ఈ షాపును గుంటూరు జిల్లా రేషన్ షాపు అసోసియేషన్ అధ్యక్షుడైన ఆదిమూలం వెంకట రంగారావు నిర్వహించుచున్నారు. గత 40 సంవత్సరాల నుండి వెంకట రంగారావు ఈ షాపు ను నిర్వహిస్తుండేవారు. ఈసందర్భంగా జనసేన పార్టీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ షాపులకు బదులుగా రేషన్ వాహనాలు ఏర్పాటు చేసి ప్రజలను రోడ్ల వెంబడి క్యూ లైన్ ద్వారా ఎర్రటి ఎండలో ప్రజలు ఇబ్బందులు పడుతూ రేషన్ సరుకులు తీసుకోవడం మనకు తెలిసిందేనని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఇరువురు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రేషన్ వాహనాలను తీసివేసి ప్రతి నెలా ఒకటోవ తేది నుండి పదిహేనో తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుండి12 గంటల వరకు సాయంత్రం4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు రేషన్ ఇచ్చేవిధంగా తిరిగి రేషన్ షాపులను ఏర్పాటు చేయడం జరిగినదని లక్ష్మి దుర్గ అన్నారు. ఈసందర్భంగా వెంకట రంగారావు మాట్లాడుతూ రేషన్ కార్డు కల్గిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరినారు . బోర్డు పై రేట్లు పట్టికను కూడా ఏర్పాటు చేశానని అయన అన్నారు. జనసేన నాయకులు దేగల ఉదయ్ మాట్లాడుతూ ప్రజలు తమ పనులు మానుకొని గతంలో మాదిరిగా నేడు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకోవడం అభినందనీయం అన్నారు. తెలుగు దేశం పార్టీ నాయకులు యు.మార్కండేయులు మాట్లాడుతూ రేషన్ కార్డులు కొత్తవి మరియు మార్పులు, చేర్పులు కూడా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరినారు.ఈకార్యక్రమంలో గ్రామ జనసైనికులు యస్ . శ్రీనివాసరావు,డి. వాసు , యు. అంకమ్మరావు , డి. కోటేశ్వరరావు , ఏ.ఆంజినేయలు, టి. మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు

# అక్రమ నిర్మాణాలను తొలగించిన ఆర్ ఐ జయప్రకాష్ నారాయణ



జిన్నారం జూన్ 02 ( లక్ష్యం ప్రతినిధి )జిన్నారం మండలం అల్లి నగర్ 27 సర్వే నంబర్లు తెలంగాణ కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను జెసిబి తో తొలగించిన జిన్నారం మండల్ ఆర్ ఐ జయప్రకాష్ నారాయణ ఈ అక్రమ నిర్మాణాలను ఎలాంటి అనుమతులు లేకుండా చట్టానికి విరుద్ధంగా నియమ నిబంధనలు లేకుండా నిర్మిస్తున్న ఇళ్లను ఆయన తొలగించారు

# సెస్సు మిన్న రైతు బంధు సున్నా

ఆళ్లగడ్డ : 15 వ్యవసాయ మార్కెట్లు.. ఏటా రూ.60 కోట్ల ఆదాయం.. సెస్సు రూపంలో కోట్లు సమకూరుతున్నా అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలవడం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు అందాలి. వైకాపా ఆపేసిన 'రైతుబంధు' పథకాన్ని పునరుద్ధరించాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు. 2014లో తెదేపా ప్రభుత్వం రైతు బంధును అమలు చేసింది.. ప్రభుత్వ గోదాముల్లో ధాన్యాన్ని దాచుకున్న రైతుకు రూ.2 లక్షల వరకు మార్కెట్ కమిటీనే మొదటి ఆరు నెలలు ఆర్థిక సాయం అందించేది. ఆరునెలల పాటు ఎలాంటి వడ్డీ ఉండదు. తర్వాత 6 నుంచి 9 నెలల వరకు 12 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు క్వింటాకు నెలకు 60 పైసలు తీసుకునే వారు. 2019లో గత వైకాపా దీన్ని అటకెక్కించింది. రైతుబంధు నిలిచిపోవడంతో ప్రభుత్వ గోదాముల్లో రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో ఇవన్నీ ఖాళీగా మారాయి. ఇప్పటికీ ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములు దాదాపుగా రైతులకు ఉపయోగపడని పరిస్థితి నెలకొంది.



ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో రూ.2.34 కోట్లు ఖర్చు చేసి 5 వేల మెట్రిక్ టన్నుల ప్రభుత్వ గోదామును ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చారు. వ్యవసాయమే ప్రధాన వనరుగా ఉన్న ఆళ్లగడ్డలో రైతుల కోసం 18 ఎకరాల విస్తీర్ణంలో కొత్త మార్కెట్ యార్డును నిర్మించారు. రైతుబంధు పథకం లేకపోవడంతో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. దీన్ని రైతులు ఉపయోగించుకోవడం లేదు.

**ప్రైవేటు గోదాములతో భారం**

వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో వంద బస్తాల నిల్వకు కేవలం రూ.200 చెల్లించాలి. ఏడాది పొడవునా నిల్వ ఉంచినా కేవలం రూ.2400 అవుతుంది. ఎన్ని నెలలు నిల్వ ఉంచితే అంతే అద్దె చెల్లించొచ్చు. అదే ప్రైవేటు గోదాములో 100 సంచులకు రూ.500 వసూలు చేస్తారు. ఏడాదికి రూ.6000 అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేటు గోదాముల్లో ధాన్యం నిల్వ ఉంచుకునే రైతుపై రెట్టింపు కంటే ఎక్కువ భారం పడుతోంది.

పి.నాగిరెడ్డిపల్లెకు చెందిన నరసింహులు రబీలో 12 ఎకరాల్లో వరి సాగు చేశారు. 400 సంచుల వడ్లను ప్రైవేటు గోదాములో నిల్వ ఉంచారు. ఇందుకు సంచికి రూ.5 చొప్పున నెలకు రూ.2వేలు అద్దె చెల్లిస్తున్నారు. బీమా కింద ఏడాదికి రూ.2400 చెల్లించారు. అదే ప్రభుత్వ గోదాములో కేవలం నెలకు రూ.800 మాత్రమే చెల్లిస్తే సరిపోయేది. ప్రభుత్వ గోదాములు అందుబాటులో లేకపోవడంతో ఆయనకు నెలకు రూ.1200 భారం పడింది.

ఆదాయంలో కేటాయింపులు ఇలా (శాతాల్లో)

పింఛన్లకు : 20

సెంట్రల్ మార్కెట్ ఫండ్‌కు: 25

ఉద్యోగుల జీతాలకు: 25

ప్రభుత్వ ఖాతాలోకి : 30 ఎరైతుకు: 0

# ముురుగుశుద్ధి.. లేదు చిత్తశుద్ధి

బొబ్బిలి : పట్టణాల్లో మురుగు సమస్యకు పరిష్కారంగా కేంద్రం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రత్యేక నిధులతో మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణాన్ని తలపెట్టింది. గత ప్రభుత్వ హయాంలో 2022లో నిధులు మంజూరు కాగా.. పనులు మాత్రం ముందుకు కదల్లేదు. బొబ్బిలిలో రూ.8 కోట్లతో ఆరు ప్లాంట్లు రాగా.. ఒక్కటీ పూర్తి కాలేదు. వీటిని పూర్తి చేసి, నిర్వహణలోకి తీసుకొస్తే మురుగు రహిత పట్టణంగా మారుతుంది.

**అయిదు మినీ.. ఒక భారీ ప్లాంటు**

బొబ్బిలిలో అయిదు చోట్ల మినీ, మరోచోట భారీ మురుగు శుద్ధి ప్లాంటు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. ఒక్కో మినీ ప్లాంటు ద్వారా 30 వేల లీటర్ల మురుగు శుద్ధి చేసే విధంగా టెండర్లు పిలిచారు. ఐటీఐ కాలనీ, పాతబొబ్బిలి, మల్లంపేట, తారకరామకాలనీ, గొల్లపల్లిలో వీటిని నిర్మించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రాగా.. టెండర్లు పిలిచి గుత్తేదారుకు అప్పగించారు. ఐటీఐ కాలనీ, పాతబొబ్బిలిలో పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన చోట్ల కానరావడం లేదు. కొన్నిచోట్ల స్థల



సమస్య ఉంది. దీనికితోడు బిల్లులు ఇవ్వకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపేసినట్లు తెలుస్తోంది.

**ఎక్కడికక్కడ నిల్వతో నరకం..** పట్టణంలో పక్కా కాలువ వ్యవస్థ లేదు. శివారు ప్రాంతాల్లో కచ్చాలే దిక్కు. ఆ మురుగంతా ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. ప్రధాన కాలువల నుంచి వచ్చే నీరు బయటకు పోవడం లేదు. వర్షం పడితే రహదారులపైకి రావడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఇలాంటి చోట్ల శుద్ధి ప్లాంట్లు నిర్మించాలని భావించి, రోజుకు 3 లక్షల లీటర్ల మురుగు పారుతుందని అంచనా వేసి అప్పట్లో ప్రతిపాదించారు.

**ప్రత్యామ్నాయం చూడరే..**

పాకివీధిలో సుమారు 3 లక్షల లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే భారీ ప్లాంటును తలపెట్టారు. పురపాలక స్థలంలో పనులు ప్రారంభిం చారు. ఆ స్థలాన్ని ఇళ్ల పట్టాలకు కేటాయించాలని పారిశుద్ధ్య కార్మికులు పనులు అడ్డుకోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా సుమారు ఎకరం స్థలాన్ని చూడాల్సి ఉన్నా.. అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

**ఇదీ పరిస్థితి**పట్టణంలో కాలువల పొడవు: 121.6 కి.మీ

ప్రధాన డ్రైన్లు: 11.03 కి.మీ బీ మధ్య, చిన్న తరహా: 47 కి.మీ, 61 కి.మీ కచ్చా కాలువలు: 2.2 కి.మీ

పూర్తికి చర్యలుప్లాంట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. రెండు చోట్ల పనులు ప్రారంభించాం. మిగిలినవి త్వరలోనే మొదలు పెడతాం. స్థలం సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

ఎల్.రామలక్ష్మి, పురపాలక కమిషనర్

# జగన్ చేయాల్సింది పశ్చాత్తాప, ప్రాయశ్చిత్త, సంతాప దినాలు : మాజీమంత్రి ప్రత్తిపాటి

**- గత ఏడాది జూన్ 4న ప్రజలు తనకు వెన్నుపోటు పొడిచారన్నది జగన్ ఉద్దేశమా? - ప్రత్తిపాటి.**

**- తండ్రికి వెన్నుపోటు.. బాబాయ్ కి గొడ్డలిపోటు.. తన కోడికత్తి గాటు.. గులకరాయి గీటు.. ఇవే జగన్ రాజకీయాలు - ప్రత్తిపాటి**

**- జగన్ మాజీ ముఖ్యమంత్రిలా కాకుండా మాజీ ఖైదీలానే ఆలోచిస్తున్నాడు : ప్రత్తిపాటి**



చిలకలూరిపేట జూన్ 2(లక్ష్యం న్యూస్):4వ తేదీన జగన్ ఎందుకు వెన్నుపోటు దినానికి పిలుపునిచ్చాడో చెప్పాలి. తనను, తన పార్టీని దారుణంగా ఓడించి, 11 సీట్లకు పరిమితం చేసి ప్రజలు తనకు వెన్నుపోటు పొడిచారన్నది జగన్ ఉద్దేశమా? ప్రజాస్వామ్యంలో ప్రజల్ని గౌరవించని, వారి అభిప్రాయాలు.. ఆలోచనలకు విలువ ఇవ్వని ఏకైక రాజకీయ నాయకుడిగా జగన్ చరిత్రలో నిలిచిపోతాడు. నిర్మాణాత్మక సూచనలు, వివరణాత్మక చర్యలతో రాష్ట్రాభివృద్ధికి సహకరిద్దాం.. పాలకపక్షానికి మంచి సూచనలు, సలహాలు ఇద్దామనే కనీస ఆలోచన కూడా జగన్ కు లేకపోవడం విచారకరం. వ్యక్తిగత అజెండా... స్వప్రయోజనాలే లక్ష్యంగా జగన్ ప్రతి అంశాన్ని రాజకీయం చేయడానికి పాకులాడుతున్నాడు. కూటమిప్రభుత్వ ప్రజారంజక పాలనపై అక్కసుతో జగన్ తనకు తానే వెన్నుపోటు పొడుచుకుంటున్నాడు కన్నతల్లి.. చెల్లి సంతోషాన్ని జీర్ణించుకోలేని జగన్.. ప్రజల ఆనందాన్ని సహిస్తాడా? జగన్ ఏ విషయంలోనూ మాజీ ముఖ్యమంత్రిలా ఆలోచన చేయడం లేదు.. చర్లపల్లి జైల్లోని మాజీ ఖైదీలానే ఆలోచిస్తున్నాడు.

**తండ్రికి వెన్నుపోటు.. బాబాయ్ కి గొడ్డలిపోటు.. కోడికత్తి గాటు.. గులకరాయి గీటు.. ఇవే జగన్ రాజకీయాలు**

జగన్ చేయాల్సింది వెన్నుపోటు దినం కాదు... పశ్చాత్తాప.. ప్రాయశ్చిత్త... సంతాప దినాలు. తన దుర్మార్గపాలనతో సర్వం కోల్పోయిన ప్రజలకు క్షమాపణ చెబుతూ ఒక ఏడాది ప్రాయశ్చిత్త దినాలు చేయాలి. తన ధనదాహానికి, దోపిడీకి బలైన లక్షల కుటుంబాలకు సంఘీభావంగా మరో ఏడాది పశ్చాత్తాప దినాలు పాటించాలి. తన కల్తీ మద్యానికి, నిర్లక్ష్యపాలనకు అన్యాయంగా బలైనవారి ఆత్మశాంతికోసం ఇంకో సంవత్సరం సంతాప దినాలు చేపట్టాలి. చేసిన తప్పులు,మోసాలు ఒప్పుకొంటూ, మూడేళ్లపాటు ప్రజల్లో తిరిగి, 2029 ఎన్నికల నాటికి ప్రజలను ప్రాధేయపడితే జగన్ పాపాల్లో కొన్నైనా పరిహారమవుతాయి. కూటమిప్రభుత్వ ప్రజారంజక పాలనపై అక్కసుతో జగన్ తనకు తానే వెన్నుపోటు పొడుచుకుంటున్నాడు. పదవి కోసం తండ్రికి వెన్నుపోటు... ఎన్నికల్లో గెలుపుకోసం బాబాయ్ కి గొడ్డలిపోటు... సానుభూతి కోసం తనకు తాను చేయించుకున్న కోడికత్తి గాటు.. గులకరాయిగీటు ఇవే జగన్ రాజకీయానికి మూలస్తంభాలు." అని మాజీ మంత్రి,శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో ఎద్దేవాచేశారు.

# అపరిష్కృత సమస్యలపై యాక్షన్ ప్లాన్

**వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయండి**

**నగరంలో గ్రీనరీకి ప్రాధాన్యమివ్వాలి**

**అభివృద్ధి పనులు, నాణ్యతగా వేగవంతంగా నిర్వహించండి**

**ఇంజినీరింగ్ అధికారులతో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు జూన్ 02(లక్ష్యం ప్రతినిధి)గుంటూరు నగరంలో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న అపరిష్కృత సమస్యలపై వెంటనే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆదేశించారు. మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం ఇంజినీరింగ్ ఈఈ, డీఈఈ, ఏఈలతో ఎమ్మెల్యే నసీర్ చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఎన్నో ఏళ్లుగా కొన్ని పనులు ముందుకు కదలడం లేదని, వాటిపై ప్రత్యేకమైన దృష్టి సారించాలని సూచించారు. నగరంలో ఐలాండ్ ను సుందరీకరణ చేపట్టి, గ్రీనరీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇది నగరానికే బ్యూటిఫికేషన్ తెచ్చేలా ఉండాలన్నారు. పార్కుల్లో పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు, చుట్టూ ప్రహరీ, గ్రీనరీపై దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న యూపీహెచ్ సీ ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టాలన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో యోగా, జిమ్ కేంద్రాలకు సెంటర్లను గుర్తించాలని సూచించారు. దీంతోపాటు సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. గుంటూరు నగరంలో అన్ని ప్రాంతాల్లో గ్రీనరీ ఉండాలని, ప్రజలకు ఆరోగ్యంతోపా టు ఆహ్లాదాన్ని అందించాలని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం పది నెలల కాలంలోనే యుద్ధప్రాతిపదిక సీసీ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు సైతం నాణ్యతగా, వేగవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మంచినీటి సరఫరా వ్యవస్థలో లోపాలను గుర్తించి సరి చేయాలన్నారు. శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణం ప్రారంభమైన నేపథ్యంలో సమగ్ర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. గత ప్రభుత్వం లో నగరంలో అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా చేశారని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి కాలనీలోనూ గుంతల రోడ్లు, మురుగుల కాలువలు, సౌకర్యాలలేమి కనిపించాయని తెలిపారు. గుంటూరు నగరాభివృద్ధికి నూతన ప్రతిపాదనలతో సిద్ధంగా ఉండాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని అభివృద్ధి పనులను సమాన స్థాయిలో చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమం లో ఇంజినీరింగ్ ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక



తెనాలి జూన్1(లక్ష్యం)ఈ నెల1 తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు జరుపుతున్నట్లు నందుల పేట వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక తెలిపారు మలేరియా ముఖ్యంగా ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వలనవస్తుందని, కానీ ఒకరి నుంచి మరొకరికి ఆడ అనాఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. ఈదోమలు మంచినీటిలో గుడ్లు పెడతాయని కనుక ప్రజలు వారానికి ఒక్కసారి అయినా నీటి నిల్వలు మార్చుకొనవలెనని తెలిపారు.ముఖ్యంగా మలేరియా లో అధికజ్వరము,వణుకు, చలి, చెమటలు పట్టటం ,ఒళ్ళు నొప్పులు తదితర లక్షణాలు ఉంటాయని, చిన్నరక్త పరీక్ష ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చునని తెలియజేశారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నట్లయితే మీ సమీప పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గాని ,ప్రభుత్వ ఆసుపత్రుల్లో గాని, ఆరోగ్య కార్యకర్తలను లేదా ఆశా కార్యకర్తలను సంప్రదించినట్లయితే ,ఈ పరీక్షను ఉచితంగా చేసి మలేరియా యొక్క రకమును నిర్ధారించి, అవసరమైన చికిత్సను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. మలేరియాఅంతం మనతోనే అనే నినాదం ద్వారా 2027 నాటికి జీరో మలేరియా కేసులు కావాలని, 2030 నాటికి మలేరియా రహిత భారతదేశం ఏర్పడాలనే లక్ష్యంతో ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, ప్రజల అవగాహనతోనే ఇది సాధ్యమని తెలిపారు తెనాలిఇన్చార్జి సహాయమలేరియాఅధికారి వంగలపున్నారెడ్డి తెలిపారు. తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠఉమాకాంత్ మాట్లాడుతూ 3సి విధానమును ప్రతి ఒక్కరూ పాటించాలని అనగా చెక్- క్లియర్ కవర్ విధానాన్ని పాటించడం ద్వారా దోమల సగంత తిని తగ్గించుకోవచ్చు అని తెలిపారు అనగా నీటి నిల్వలను కనీసము వారానికి ఒక్కసారైనా చెక్ చేసుకొనుట ఆ నీటి నిల్వలను క్లియర్ చేసుకొనుట అనగా శుభ్రము చేసుకొనుట అనంతరము కవర్ చేసుకొనుట అనగా నీటి నిలవలపై మూతలు పెట్టుకొనుట వలనదోమలు నీటిపై వాలే అవకాశం లేక గుడ్లు పెట్టడానికి అవకాశం ఉండదని తద్వారా దోమల యొక్క సంతతి తగ్గి వాటి ద్వారా వ్యాపించే వ్యాధులు తగ్గుతాయని తెలిపారు. ఆరోగ్యవిస్తరణాధికారి అందెబాలచంద్రమౌళి మాట్లాడుతూ మలేరియా దోమలు మంచినీటిలో గుడ్లు పెడతాయని,కనుక ప్రజలు ఇంటి లోపల ఇంటి చుట్టుపక్కల నీటి నిల్వలు లేకుండా చూసుకొనవలెనని కోరారు.ముఖ్యంగా ఈ దోమలు తొట్లు ,గాబులు, టైర్లు, కొబ్బరి బోండాలు, మూతలు లేని ఓవర్ హెడ్ ట్యాంకులు ,ఫ్రిడ్జ్ ,కూలర్లు నీరు ఇంకనిపూలకుండీలు, తదితర వాటిల్లో గుడ్లు పెడతాయని కనుక వాటిని పరిశీలించుకుంటూ ఉండాలని తెలియజేశారు.కిటికీలకు తలుపులకుమెష్ లు బిగించుకొనుట సాయంత్రం సమయంలో కిటికీలు తలుపులు మూయుట ద్వారా దోమలు ఇంట్లోకి ప్రవేశించకుండా చూసుకొనవచ్చునని,దోమతెరలు, పూర్తి వస్త్రధారణ ధరించుట ద్వారా దోమ కాటు నుండి రక్షణ పొందవచ్చునని తెలిపారు. అనంతరం నందుల పేట వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక జండా ఊపి ర్యాలీ ప్రారంభించగా మలేరియా మరియు దోమల నియంత్రణపై నినాదాలు చేసుకుంటూ ర్యాలీని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మలేరియా శాఖ ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు,బండారు మల్లేశ్వరరావు, దాసరిశివ నాగమల్లేశ్వర రావు,ఆరోగ్య కార్యకర్తలు షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, సంకాశరత్ బాబు,ఎ. వేణుగోపాలరావు, దీపాల శ్రీనివాసరావు,లెప్రా సొసైటీ కార్యకర్త రమణ,నందుల పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు,ఇతర సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ అన్ని ప్రభుత్వ రంగాల్లో అమలు చేయాలి డొక్కా మాణిక్య వరప్రసాద్

గుంటూరు జూన్ 2 (లక్ష్యం ప్రతినిధి) సోమవారం గుంటూరులో జరిగిన గ్రీవెన్స్ లో మాజీ మంత్రి డొక్కా ఎస్సీ వర్గీకరణకు సంబంధించి అమలకు గౌరవ జెసి గారికి వినతి పత్రం అందించి మీడియా వారితో మాట్లాడారు.ఎన్నో ఉద్యమాల తర్వాత ఎస్సి వర్గీకరణ ఏర్పడింది.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూటమి నాయకులు ఎస్సి వర్గీకరణకు ఆమోదం తెలిపారు అని అన్నారు. ఏసీ వర్గీకరణకు ఆమోదం తెలపడం ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా రాష్ట్ర ఎస్సీ ప్రజలకు జనాభా ప్రతిపాదికన వారికి రావలసిన రిజర్వేషన్లు వారికి అందుతున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రీవెన్స్ లో ఎస్సి వర్గీకరణ పై అర్జీలు ఇచ్చాం అని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వ ఉద్యోగాలు, పదోన్నతులు మరియు వివిధ



విద్యాసంస్థల ప్రవేశాలలో, మరియు ప్రభుత్వ అన్ని రంగాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని గౌరవనీయులైన జేసి గారికి వినతి పత్రం అందించారు. ఇది భారత రాజ్యాంగ నిబంధనలు గౌరవ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చేయబడాలి, ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, మరియు స్థానిక సంస్థల నియమాకాల్లో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పదోన్నతులు విషయంలో రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ మరియు ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థలలో ప్రవేశాల విషయంలో ఎస్సీ వర్గీకరణ అనుసరించాలి, తద్వారా చారిత్రకంగా వెనుకబడ్డ మాదిగ వర్గానికి న్యాయమైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విషయాలను క్రింది స్థాయి అధికారులు గమనించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎస్సీ లోని అన్ని కులాలు ఆనందంగా ఉన్నారు అని తెలిపారు.. ఈ కార్యక్రమంలో మాదిగ జన సేవా సమితి నాయకులు చావలి బాలస్వామి, అత్తోట జోసఫ్ కుమార్, కొండమూది భగవాన్ దాస్, దాసరి జాన్ బాబు, మరియు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అవినీతి పునాదులు.. బహుళ అక్రమాలు

నంద్యాల : ఉమ్మడి జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం మందకొడిగా సాగుతుండటంతో కొందరు నిర్మాణదారులు అక్రమాలకు తెరలేపారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కుమ్మక్కై భవనం నిర్మాణ సమయంలోనే ఫ్లాట్లను విక్రయించి వాటికి మార్టిగేజ్‌ను విడుదల చేయిస్తున్నారు. బ్యాంకుల్లో రుణాలూ ఇప్పిస్తున్నారు. మరికొన్నింటికి మున్సిపాల్టీతో సంబంధం లేకుండానే తనఖా రిజిస్ట్రేషన్ అలాగే ఉంచి సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులకు రూ.లక్షల్లో ముడుపులు ముట్టజెబుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**పుర ఆదాయానికి గండి**

నిబంధనల ప్రకారం మున్సిపాల్టీల్లో చేపట్టే అపార్ట్‌మెంట్ల ఆస్తి విలువలో 10 శాతం పురపాలిక పేరుతో మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్ చేయాలి. నిర్మాణదారులు ప్లాన్‌లో చూపిన విధంగానే నిర్మాణాలు చేయాలి. నిర్మాణాలు పూర్తయిన తర్వాత అన్నీ సవ్యంగా ఉంటే తొలుత చేసిన మార్ట్‌గేజ్‌ను విడుదల చేస్తారు. అక్రమాల్లో ఆరితేరిన కొంతమంది నిర్మాణదారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. నిర్మాణాలు పూర్తవకుండానే మార్టిగేజ్‌లను విడుదల చేయించుకుంటున్నారు. ఇందుకు కొంతమంది టీపీవోలు, టీపీఎస్, బిల్డింగ్



ఇన్‌స్పెక్టర్లు వత్తాసు పలుకుతుండగా ఉన్నతాధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారు. దీంతో మున్సిపాల్టీలు పెద్దఎత్తున ఆదాయం కోల్పోతున్నాయి.

**అన్నింటా అక్రమాలే**

జిల్లా కేంద్రం నంద్యాలలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం వేగంగా చేస్తారనే పేరున్న ఓ నిర్మాణదారు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో అంటకాగుతుంటారు. ఈయన ఆధ్వర్యంలో పద్మావతినగర్, ఎన్జీవో కాలనీల్లో చేపట్టిన అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే రూ.కోట్ల విలువైన ఫ్లాట్లను తనఖా పూచీకత్తు రిజిస్ట్రేషన్లను విడుదల చేశారు. ఆ పత్రాలతోనే నిర్మాణదారుడు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు శాఖల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలుదారులకు రుణాలు ఇప్పించారు. వచ్చిన డబ్బుతో మరికొన్ని నిర్మాణాల్లో పెట్టుబడులు పెట్టారు.

కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీ, సంతోష్‌నగర్‌లలో రెండేళ్ల క్రితం బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టిన గుర్తింపు పొందిన నిర్మాణ సంస్థ కార్పొరేషన్‌లో పూచీకత్తు ఒప్పందం విడుదల చేయకుండానే అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. మరికొన్ని ఫ్లాట్లను ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇతరులకు విక్రయించి వాటిని బ్యాంకులో తనఖా పెట్టించి మరి రుణాలు ఇప్పించారు. ఇదే సంస్థ నంద్యాలలో కూడా ఇటీవల ఇదే ప్రయోగం చేస్తుంది.

నంద్యాల ఫరూక్‌నగర్‌లో ఒక నాయకుడు నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యాపారి రెండేళ్ల కిందట రూ.65 లక్షలతో ఫ్లాట్ కొనుగోలు చేశారు. అప్పట్లో ఇది మార్టిగేజ్‌లో ఉండగానే బ్యాంకులో తనఖా పెట్టి రూ.38 లక్షల రుణం తీసుకున్నారు.

# అక్రమాల లోతెంత?

విశాఖపట్నం: భీమిలి వద్ద తీరంలో వైకాపా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సాగించిన అక్రమాల లోతులను అధికారులు పరిశీలిస్తున్నారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన కట్టడాలను పూర్తిగా తొలగించి పూర్వస్థితి తీసుకురావాలని హైకోర్టు ఇటీవల ఆదేశించింది. ఈ నేపథ్యంలో పునాది ఎంత లోతు ఉంది? ఎంత ఖర్చు అవుతుంది? అని అంచనా వేయడానికి నిర్ణయించుకున్నారు. రెండు రోజుల కిందట మనుషులతో పునాదుల వద్ద సమాంతరంగా తవ్వి లోతును గుర్తించేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. దీంతో బుధవారం జేసీబీతో పునాది పక్కన ఇసుక తవ్వి లోతు పరిశీలించారు. పునాదిని నిర్మించిన తీరు చూసి ప్లానింగ్ అధికారులు ఖంగుతిన్నారు. 588 మీటర్ల పొడవున్న పునాది సుమారు 6-8 అడుగుల్లోతు వరకు ఉంది. అడుగు భాగాన పునాది వెడల్పు 10 అడుగుల మేర ఉంది. కోర్టు ఆదేశాల ప్రకారం ఇదంతా పూర్తిగా తొలగించడానికి రూ.50 లక్షలపైగా ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే



స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీ, ఇతర నిర్మాణాలు కూల్చడానికి రూ.4లక్షలు ఖర్చు అయినట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు. కట్టడాలు కూల్చడానికి పెట్టిన ఖర్చు నేహారెడ్డికి చెందిన అవ్యాన్ సంస్థ నుంచి వసూలు చేయాలని కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

**నక్షత్రాల హొటల్‌కేనా?:** విజయసాయిరెడ్డి కుమార్తె భీమిలి తీరాన్ని ఆనుకుని అవ్యాన్ ఎల్ఎల్‌పీ సంస్థ పేరిట ఉన్న స్థలంలో భారీ నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికలు చేశారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘన అంశం తెరపైకి వచ్చిన సమయంలో ఐదు నక్షత్రాల హొటల్ నిర్మాణం కోసమే శాశ్వత కట్టడాలు చేపడుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సముద్రానికి దగ్గరిగా నిర్మించిన ప్రహరీ పునాదులు పరిశీలించగా.. అడుగున పది అడుగుల మేర వెడల్పుతో కాంక్రీట్ పర్చడం హొటల్ కోసమేనని స్పష్టమవుతోందని పలువురు భావిస్తున్నారు.

17న పరిశీలన: తీరంలో శాశ్వత కట్టడాలను కూల్చడానికి అయ్యే ఖర్చుతోపాటు, నిర్మాణాల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని అధ్యయనం చేసేందుకు కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ అధికారులతో నిపుణుల కమిటీతో అంచనా వేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నిపుణులు కమిటీలో అధికారి ఈనెల 17వ తేదీన పరిశీలించే అవకాశం ఉంది. పర్యావరణానికి జరిగిన నష్టం అంచనా వేసి కోర్టుకు చెప్పాల్సి ఉండటంతో కేసు వాయిదాకు ముందే ఈ తనిఖీ పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులకు కోర్టు నిర్దేశం చేసింది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

## సొంతింటి కలకు కొండంత అండ

నక్కపల్లి : సొంత గూడు ఉండాలని ప్రతి కుటుంబం కోరుకుంటుంది. గడిచిన వైకాపా పాలనలో జగనన్న ఇళ్ల పేరిట ఆర్భాటంగా మొదలు పెట్టిన గృహ నిర్మాణాలకు సరైన సహకారం అందించక పోవడంతో అవన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి నిర్మాణాలను కొనసాగించేలా తీపికబురు చెప్పింది. లబ్ధిదారుల్లో వెనుకబడిన వర్గాలకు అదనపు ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించింది. దీని ద్వారా అనకాపల్లి జిల్లాలో వేలాదిమందికి మేలు జరగనుంది.అయిదేళ్ల పాలనలో జిల్లాలో 61 వేలకు పైగా ఇళ్లను మంజూరు చేశారు. దీనికి కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం రూ. 1.8 లక్షలు అమలు చేస్తూ, జగన్ పేరును ప్రచారం చేసుకున్నారు. కాగా ధరాభారం, ప్రోత్సాహం లేకపోవడంతో చాలామంది ఇళ్లను నిర్మించుకోలేక పోయారు. జగన్ అధికారం కోల్పోయేనాటికి అసలు ప్రారంభం కానివి, వివిధ స్థాయిల్లో ఆపేసినవి సుమారు 40 వేలకు వరకు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఆసక్తి ఉన్న లబ్ధిదారులను గుర్తించి గడిచిన రెండు నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ పెట్టి చాలా ఇళ్లను పూర్తిచేయించగా, జిల్లాలో సుమారు 5500 వరకు ఉన్నాయి. ప్రస్తుతం మరో ఏడువేల ఇళ్లను పూర్తి చేయించే పనిలో ఉన్నారు. ఇవన్నీ పోనూ మిగిలిన వాటిలో దాదాపు బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల వారు ఎక్కువగా ఉండటంతో వీరందరికీ అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ క్రమంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, చేనేత వర్గాలకు అదనపు ఆర్థిక సాయం చేయనుంది. ఆ మేరకు జిల్లా పరిధిలో దాదాపు 26,800 ఇళ్లను నిర్మించాల్సి ఉంది. ఇందులో ఓసీలు సుమారు 5800 మంది ఉన్నారు. ఇవి మినహాయిస్తే, దాదాపు 21 వేల మందికి మేలు జరగనుంది. ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం ఇలాంటి వివరాలను సేకరించే పనిలో పడింది.

**సాయం ఇలా..**

ఎస్సీ, బీసీ, చేనేతలకు: రూ. 50 వేలుఎస్టీలు: రూ. 75 వేలు

ఎస్టీల్లో బాగా వెనుకబడిన వారికి: రూ. లక్షజిల్లాలో ఇళ్ల పరిస్థితి ఇది

మొత్తం ఇళ్లు: 61,505పూర్తయినవి: 26,699ప్రారంభం కానివి: 17,559వివిధ దశల్లో నిలిచినవి: 17,247

**సద్వినియోగం చేసుకోండి**

అదనపు ఆర్థిక సహాయం వినియోగించుకుని ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80 లక్షలు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 17,749 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు చెందిన 13,548 మంది లబ్ధిదారులకు రూ.70.04 కోట్ల అదనపు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. జిల్లాలో మే చివరినాటికి 13,687 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకున్నామన్నారు.

# పథకం.. పట్టదా?



అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 1,059 గ్రామాలకు పైగా తాగునీరు అందించే శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నిలిచిపోయి రెండు నెలలు కావస్తోంది. కార్మికులు 53 రోజులుగా సమ్మె చేస్తున్నా... సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమ్మెలోకి వెళ్లిన ప్రతిసారీ సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు తప్ప.. ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదని కార్మిక సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. పెండింగ్ జీతాలు, పీఎఫ్ బకాయిల సాధనకు సమ్మెలోకి వెళ్లిన కార్మికులతో అధికారులు పలుమార్లు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో పంపుహౌస్‌లు మూతపడ్డాయి. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు. కొన్నిచోట్ల స్థానిక పథకాల నుంచి నీరందిస్తున్నా చాలడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా అరకొరగా అందిస్తున్నారు.

**రూ.5 కోట్లు విడుదల చేసినా..**

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో 630 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వైకాపా పాలన ముగిసే నాటికి ఏడాది జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సమస్యను పరిష్కరించేందుకు కొంతమేర నిధులు విడుదల చేసి కార్మికులకు జీతాలు చెల్లించారు. నిర్వహణకు సరిపడా నిధులు మంజూరు చేయకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

ప్రస్తుతం ఫేజ్-1లో 6 నెలలు, ఫేజ్-2లో 10 నెలలు, ఫేజ్-4లో 4 నెలల జీతాలు చెల్లించాల్సి ఉంది. వీటితో పాటు సుమారు 30 నెలలకు సంబంధించిన పీఎఫ్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల రూ.5 కోట్ల మేర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వాటితో కేవలం 2, 3 నెలల జీతాలకు సరిపోతాయని కార్మికులు చెబుతున్నారు. ఇందులోనూ గుత్తేదారులు రూ.2 వేలు కోత విధించి ఇచ్చారని ఆరోపిస్తున్నారు.

**అన్ని దశల్లో చర్చలు విఫలం**

ఏప్రిల్ 6 నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. మే 2న అధికారులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. 6న కలెక్టర్ కార్మిక సంఘ నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. 7న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్మికులతో చర్చలు జరిపినా ఫలితం దక్కలేదు. 8న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన కార్మికులు సమస్యలపై వినతిపత్రం అందించారు. 11న గుత్తేదారులు బలవంతంగా మోటార్లు ఆన్ చేయగా లీకేజీల కారణంగా వెనక్కి తగ్గారు. 12న కలెక్టర్, 13న ఆర్డీవో కేశవనాయుడు జరిపిన చర్చలు విఫలమయ్యాయి.

**శాశ్వత పరిష్కారం చూపుతాం- వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం**

జీతాల కోసం రూ.5 కోట్లు విడుదల చేసినా కార్మికులు సమ్మె విరమించలేదు. గతంలో జరిగిన కొన్ని తప్పుల కారణంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న టెండర్ల గడువు ముగిసింది. త్వరలోనే టెండర్లు పిలిచి కొత్తవారికి అప్పగిస్తాం. ఇకపై కార్మికుల జీతాలను ప్రభుత్వమే పర్యవేక్షిస్తుంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం.

# అర్హులే మిగలాలి.. అనర్హుల లెక్క తేలాలి!



అనంతపురం : వీధి వ్యాపారులు, చిరు వర్తకుల కుటుంబాలకు అండగా నిలవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మాదిరిగా అనర్హులకు రుణాలు మంజూరు చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. లెక్క పక్కాగా చేసి వారికి స్వల్పకాలిక రుణాలతోపాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సర్వే చేస్తున్నారు.

**వైకాపా మద్దతుదారులకే లబ్ధి**గతంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రీసోర్స్ పర్సన్ల మద్దతుదారులకే కార్డులతో సహా రుణాలు ఇచ్చారు. దీంతో అర్హులైన వారికి మొండిచేయి లభించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మెప్మా అనుసంధానంగానే సచివాలయం సిబ్బందితో సర్వే చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన సంపూర్ణ వివరాలను క్రోడీకరిస్తున్నారు.గత వైకాపా హయాంలో ఆయా ప్రాంతాల్లోని కార్పొరేటర్లు, వార్డు కౌన్సిలర్లు, వైకాపా నేతలు ప్రతిపాదించిన వారికే రుణాలు దక్కాయి. టైలర్లకు, దుకాణదారులకు అసలు ఎలాంటి వ్యాపారం చేయని వారు కూడా లబ్ధిపొందారు. వీధి వ్యాపారుల కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం స్వానిధి పథకం ప్రవేశపెట్టింది. వ్యాపారులకు మూడు దశల్లో రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు చొప్పున ఇచ్చారు.

**మెప్మాకు స్వానిధికి భారీ వ్యత్యాసం**

మెప్మా నమోదు చేసిన వివరాలకు, పీఎం స్వానిధి డేటాకు వ్యత్యాసం ఉంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో మెప్మా డేటా ప్రకారం 12,764 మంది ఉంటే స్వానిధిలో మరో 26,224 మంది మొత్తంగా 38,988 మంది వీధి వ్యాపారులు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. 2014లోనే తెదేపా హయాంలో వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం సచివాలయ సిబ్బందిని క్షేత్రస్థాయిలో సమగ్ర వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించడంతో 15 రోజులుగా వివరాలు క్రోడీకరిస్తున్నారు. వీధి వ్యాపారుల ఆధార్ నంబరు, ఏ రకం వ్యాపారం చేస్తున్నారు, సంపాదన, కుటుంబ వివరాలను సేకరిస్తున్నారు. మరో వారం రోజుల్లో అర్హులెవరో తేలనుంది. మెప్మా పీడీ విశ్వజ్యోతి మాట్లాడుతూ.. అర్హులను గుర్తించి వారి వివరాలు నమోదు చేస్తున్నామని తెలిపారు. మరో వారం రోజుల్లో సర్వే పూర్తి అవుతుందన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి.. సేవలకు సుస్తీ



గుంతకల్లు : గుంతకల్లులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులు అరకొర వైద్యంతో అవస్థలు పడుతున్నారు. వంద పడకల ఆసుపత్రికి చుట్టూ పక్కల ఉన్న మండలాల ప్రజలు, సరిహద్దు లోని కర్నూలు జిల్లాకు చెందిన గ్రామీణ ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. ఈక్రమంలో సిబ్బంది సక్రమంగా వైద్యం అందించటం లేదని రోగులు, వారి సహాయకులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కొన్ని రకాల మందులను సైతం బయటికి రాసిస్తున్నారని పలువురు వాపోయారు. ఏరియా ఆసుపత్రిలో రోజువారి ఓపీ 600 నుంచి 700 దాకా ఉంటుంది. 30 మందికి పైగా జ్వరం, దగ్గు, వాంతులు వివిధ జబ్బులతో ఇన్ పేషెంట్లుగా చేరుతున్నారు. రోగులకు కేటాయించే మంచాలకు బెడ్ కవర్లు ఉండటం లేదు. ఇంటి నుంచి తెచ్చుకున్న బెడ్‌సీట్లను పరుచుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాక సెలైన్ బాటిల్స్ ఎక్కించాల్సి ఉంటుంది. మొదటి రోజు బాటిల్ ఎక్కిస్తారని, మరుసటి రోజు బయట తెచ్చుకోమని చెబుతున్నారని రోగి బంధువులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఆసుపత్రిలో మందుల కొరత లేదని చెబుతూనే ఉన్నా వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని రోగులు వాపోతున్నారు.

వేధిస్తున్న స్టాఫ్‌నర్సుల కొరత

ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల కొరత వేధిస్తోంది. 24 మందికి గాను 14 మంది నర్సులు ఉన్నారు. రోగులకు వైద్యసేవలు అందించడానికి ఇబ్బందిగా ఉందని పలువురు వాపోతున్నారు. ఇక్కడ పది వరకు స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీలు ఉండటం గమనార్హం.

**ఇబ్బంది పడుతున్నాం - జమీనా, గుంతకల్లు తగిన వైద్యసేవలు**

వాంతుల కావడంతో వారం రోజుల కిందట ఆసుపత్రిలో చేరా. మొదటి రోజు మాత్రమే సెలైన్ బాటిల్ ఎక్కించారు. తర్వాత ప్రైవేటు మందుల దుకాణంలో సెలైన్ కొనుక్కోవాలని చెబుతున్నారు. వైద్యులు రోజుకు రెండు రౌండ్లు చెకప్‌కు వస్తున్నారు. పిలిచేంత వరకు సిబ్బంది రావటం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. **అందిస్తున్నాం- డా.అజేంద్రరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్** ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్యసేవలు అందిస్తున్నాం. స్టాఫ్‌నర్సుల కొరత ఉంది. ఉన్నవారితోనే వైద్యం సక్రమంగా అందిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం.

# జలం నిలవాలి జనం మురవాలి

కర్నూలు : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా జలభగ్నం చేసింది.. నిర్వహణకు పైసా ఇవ్వలేదు.. కేసీ చెదిరింది.. ఎస్సార్బీసీ ఏడిపిస్తోంది.. అలగనూరు కుప్పకూలింది.. గోరుకల్లు లీకేజీ అవుతోంది.. అవుకు అధోగతి పాలైంది.. పెండింగ్ ప్రాజెక్టుల దస్త్రాన్ని అటకెక్కించారు.. తుంగభద్ర, హంద్రీ, కృష్ణమ్మ నదులు పారుతున్నా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేల ఎకరాలు బీళ్లుగా మారాయి.. ప్ర'జల'కు ప్రాధాన్యం ఇచ్చేలా 'కూటమి' ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జలాశయాల నిర్వహణకు నిధులు విడుదల చేసింది.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టబోతున్నారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలవనరుల బాగుకు రూ.1,568 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు.

**వీటికి మోక్షం కలిగేనా**

పశ్చిమ ప్రాంతంలో ఆర్డీఎస్, వేదవతి జలాశయాల నిర్మాణానికి గతంలో తెదేపా పునాది వేసింది. 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూ.1,942 కోట్లతో వేదవతి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటివరకు రూ.90 కోట్లు ఖర్చు చేశారు. దీన్ని గత వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది.

కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, నియోజకవర్గాలకు నీరందించేలా రూ.1,985 కోట్ల వ్యయంతో ఆర్డీఎస్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రూ.12.60 కోట్ల వరకు వెచ్చించారు. అందుబాటులోకొస్తే 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సుంకేసుల (రూ.27 కోట్లు)

కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల పరిధిలో 2.65 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే సుంకేసుల జలాశయానికి రూ.27 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. కాల్వ అధ్వానంగా మారడంతో 1,500 క్యూసెక్కులు ప్రవహించని పరిస్థితి నెలకొంది.సుంకేసుల, అలగనూరు, ముచ్చుమర్రి జలాశయాలకు కలిపి తొలుత రూ.107 కోట్లకు ప్రతిపాదించారు.. ఆ తర్వాత రూ.27 కోట్లకు కుదించారు.

ఎస్సార్బీసీ (రూ.89 కోట్లు)

శ్రీశైలం కుడిగట్టు కాల్వకు గోరుకల్లు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తుంటారు. జలాశయం పనులు పూర్తికాకపోవడంతో 12 టీఎంసీలు నిల్వ చేయని పరిస్థితి నెలకొంది.

గత ఐదేళ్లు నిర్వహణ చేపట్టకపోవడంతో కట్ట కుంగింది. ఈ నేపథ్యంలో రూ.89 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు.

అవుకు (రూ.40కోట్లు)

గత ఐదేళ్లుగా అవుకు జలాశయం నిర్వహణ పనులు చేపట్టలేదు. గేట్ల వద్ద నీటి లీకేజీ కొనసాగుతోంది. గత ప్రభుత్వం పైసా ఇవ్వలేదు.. రెండో విడత పనులకు సంబంధించి రూ.24 కోట్లు గుత్తేదారుకు చెల్లించాల్సి ఉంది.

వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని అవుకు సొరంగం, జలాశయం నిర్వహణకు రూ.40 కోట్ల వరకు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

హంద్రీనీవా (రూ.700కోట్లు)

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాల్వను విస్తరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మల్యాల నుంచి జీడిపల్లి (0-216 కి.మీ.) వరకు కాల్వ వెడల్పు, లైనింగ్ పనులు చేపట్టేందుకు రూ.700 కోట్లు అవసరమని ఇంజినీర్లు ప్రతిపాదించారు.

ప్రస్తుతం కాల్వలో 1,900 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. విస్తరించి 3,850 క్యూసెక్కులు తరలించనున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గురు రాఘవేంద్ర (రూ.57కోట్లు)తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టు స్థిరీకరించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా కనీసం విద్యుత్తు బిల్లులు చెల్లించలేదు.. నిర్వహణలేక మోటార్లు సతాయిస్తున్నాయి. వీటిని బాగు చేసేందుకు రూ.57 కోట్లు అవసరమవుతాయి.

శ్రీశైలం (రూ.18కోట్లు)కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టుకు రూ.18 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులతో కొంతవరకు పనులు చేసేందుకు అవకాశముంటుంది, డ్రిప్ ద్వారా నిధులు విడుదలైతే తప్ప పూర్తిస్థాయిలో పనులు చేసేందుకు అవకాశముండదని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్ రూ: 313 కోట్లు

కేసీ, రాజోలి, జొలదరాశి (235)

గాజులదిన్నె (35)

చెరువుల నిర్వహణ (46)

సిద్ధాపురం ఎత్తిపోతల (8)

# ఉపాధి మేడలు

కర్నూలు : ఐదేళ్ల వైకాపా కాలంలో భవన నిర్మాణ రంగం కుదేలైంది. 'కొత్త ఇసుక విధానం' పేరిట రీచ్‌లను మూసేశారు. ఇసుక అందుబాటులో లేకుండా చేశారు. భవనాలు, ఇళ్ల పనులన్నీ ఆగిపోవడంతో కార్మికులకు నెలల తరబడి ఉపాధి కరవైంది. ఇతర రాష్ట్రాలకు వలస పోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అర్ధాకలితో అలమటించేలా చేసింది. కొందరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కార్మికులకు చేతినిండా పని దొరుకుతోంది. పనుల స్థాయిని బట్టి రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు కూలి లభిస్తోంది. ఏడాదిలో అక్టోబరు నుంచి మే వరకు నిర్మాణాలకు అనుకూల వాతావరణం ఉంటుంది. 'కూటమి' ప్రభుత్వం పల్లె పండగ పేరుతో సిమెంటు దారులు నిర్మిస్తోంది.



ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1,000, రూ.1,500, రూ.2 వేలకు అందుబాటులో ఉంది. కారుచౌకగా ఇసుక లభిస్తుండటంతో మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులు ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు." నగరంలో మూడు సెంట్లలో ఇంటి నిర్మాణానికి దసరా రోజున శంకుస్థాపన చేశాం.. రూ.40 లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు" బ్యాంకు ఉద్యోగి నవీన్ పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ పట్టణాల్లో ప్రస్తుతం రూ.వెయ్యి కోట్లు వెచ్చించి ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నట్లు అంచనా. ఒక్క కర్నూలు నగరంలోనే గత నెలలో వంద ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు.

**దండిగా ఇసుక నిల్వలు** గతంలో టన్ను రూ.326 ఉండగా.. దాన్ని కూటమి ప్రభుత్వం రూ.320కు తగ్గించింది. ప్రస్తుతం సి.బెళగల్ మండలంలోని డీసిల్టింగ్ పాయింట్లలో టన్ను రూ.202, మరలి ఇసుక రీచ్‌లో రూ.119, గుడికంబాలి రూ.39, నదిచాగిలో రూ.40 నామమాత్రపు ధరకు ఇసుక లభిస్తోంది.ఉమ్మడి జిల్లాలో కార్మికుల సంఖ్య 1,45,350

